# జనపదం
J A N A P A D H A M

హైదరాబాద్ | ఆదివారం 20 అక్టోబర్ 2024 | సంచిక: 1 సంపుటి: 132

తెలుగు దినపత్రిక




## టీమిండియా 462 ఆలౌట్

సత్తా చాటిన బౌలర్లు.. కివీస్ లక్ష్యం 107 పరుగులు నేడే చివరి రోజు..

..........వివరాలు 2లో





# లాఠీల రాజ్యం..

- ప్రశ్నిస్తే వీపులు సాపే..
- విరుచుకుపడుతున్న పోలీసులు..
- అన్యాయంపై నిలదీస్తే అంతే సంగతులు..
- రాష్ట్రంలో ఖాకీల దాష్టీకం..
- భయాందోళనలో ప్రజలు.. పెదవి విరుస్తున్న మేధావులు..

జనపదం, బ్యూరో

రాష్ట్రంలో లాఠీ రాజ్యమేలుతున్నది. పోలీసులు అమాయకులపై విరుచుకపడుతున్నారు. పాలకులిచ్చిన ధైర్యమో., ప్రజలంటే అలుసోగానీ రక్షకభటులు సామాన్యుడిపైబడి చచ్చేలా కొడ్తున్నారు. కడుపు బాధను కూడా చెప్పుకునే ధైర్యం చేయకుండా నిరంకుశంగా వ్యవహరిస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాటల తీరుతో మరింత రెచ్చిపోతున్నారు. పార్టీల మధ్య పోరు చివరకు ప్రజాసమస్యలపై కూడా గొంతువిప్పలేని నిస్సహాయ స్థితికి చేరింది.

**ప్రశ్నిస్తే వీపులు సాపే..**

జరుగుతున్న అన్యాయంపై ప్రశ్నిస్తే ఇక మూడినట్టే అని పరిస్థితి కల్పిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇదేమని ప్రశ్నించిన పెద్దలే ఇప్పుడు అదే పంథాను అనుసరిస్తూ తేడా ఏముండదు అనే సందేశాన్ని ఇస్తున్నారు. మారింది సర్కారే తప్ప మేమెప్పటికి ఇంతే అనే ధోరణిలో వ్యవహరిస్తున్నారు. అప్పుడు చేసింది నచ్చకనే మార్పు కోరుకుంటే, మార్పు ఆశించడం మీ తప్పు, మేం మాలాగే ఉండడం మా నైజం అన్నరీతిలో రేవంత్ రెడ్డి కూడా వ్యవహరిస్తున్నట్టు జరుగుతున్న పరిణామాలతో తెలుస్తున్నది. గ్రూప్ 1 అభ్యర్థుల న్యాయమైన డిమాండ్ ను కూడా చట్టవిరుద్ధం అన్నట్లుగా చూసి అర్ధరాత్రి వేళ వారిపై విరుచుపడిన ఘటన మరీ ఆక్షేపనీయం. గతంలో క్యాంపస్ లు, యూనివర్సిటీల్లో విస్తృతంగా పర్యటించి నిరుద్యోగులు, విద్యార్థులకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రపంచానికి చాటి, అప్పటి ప్రభుత్వంపై విరుచుకుపడిన మహనీయులే ఇప్పుడు సర్కార్ పెద్దలుగా వెలుగబెడుతూ అంతా ఆ తాను ముక్కలే అన్న నగ్న సత్యాన్ని చాటుతున్నారు.

**విరుచుకుపడుతున్న పోలీసులు..**

అధికార పార్టీ ఏదైతే దానికి కొమ్ము కాయడమే పనిగా ఖాకీలు వ్యవహరిస్తున్న తీరు తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ప్రజా భద్రతకు పెద్దపీట వేయడం మరిచి కేవలం ప్రభుత్వ పెద్దలను ప్రసన్నం చేసుకోవడం, వారి ఆదేశాలను అమలులో పెట్టడమే విధిగా భావిస్తున్న తీరుపై జనాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. అన్యాయాన్ని అరికట్టాల్సిన యంత్రాంగం, ......(తరువాయి 4లో)

**వీపులు సాపవుతున్నాయి. మాటలు బయటకొస్తే చాలు కట్టెలు పొట్టుపొట్టు విరుగుతున్నాయి. అస్సలు అడుగడమే చేయొద్దా.., ఆశించింది మరీ ఎక్కువనా.., లేదంటే ఆ వ్యవహారమే ఇంతనాగానీ.., రాష్ట్రంలో లాఠీ రాజ్యమేలుతున్నది. మొన్న అశోక్ నగర్ సాక్షిగా గ్రూప్ 1 అభ్యర్థుల భరతం పట్టిన విషయం మరువకముందే నిన్న ముత్యాలమ్మ సమక్షంలో మరోమారు స్వైరవిహారం చేసింది. అన్యాయంపై ప్రశ్నిస్తే చాలు సమాధానం చెప్పేది లాఠీయే అవుతున్నది. రోడ్డెక్కి నినదిస్తే చాలు పోలీసే నోరు మూయిస్తున్నాడు. కోరుకున్న పాలనలో ఊహించని పరిణామాలతో జనమంతా నీరసించి పడిపోతుంటే., తొక్కుకుంటూ, రెచ్చిపోతున్న పాలకులు మాత్రం మరింత బూస్టింగ్ అన్నట్టుగా చెలరేగిపోతున్నారు. వలయాలే అక్కర్లేదన్న నాయకులు ఇప్పుడు పద్మవ్యూహమంటి వలయాల్లో పదిలంగా ప్రయాణిస్తూ.., బతుకు దెరువు కోసం గొంతెత్తుతున్న వారిని కటకటాల్లోకి నెట్టేందుకు వెనకాడని దయనీయమైన దుస్థితికి హస్తం సాక్ష్యంగా మారింది.**



# అయినా ఆగవు.. మూసుకుని రాయండి..

- ఆందోళన వద్దు.. పరీక్షలకు సిద్ధమవ్వండి..
- ఉద్యోగాలు భర్తీ చేయడమే ముందున్న లక్ష్యం
- బీఆర్ఎస్ హయాంలో ప్రగతి భవన్ గేటునైనా తాకనిచ్చారా..?
- పరీక్షలు రాయాల్సిన అభ్యర్థులు బీఆర్ఎస్ ఉచ్చులో పడకండి
- అభ్యర్థులపై కేసులు పెట్టకండి
- ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రతిబంధకాలు అవుతాయి
- పోలీస్ డ్యూటీ మీట్ ముగింపు వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి

జనపదం, బ్యూరో

రాష్ట్రంలో గ్రూప్--1 మెయిన్స్ పరీక్షలు ఈ నెల 21 నుంచి యథాతథంగా జరుగుతాయని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. "పరీక్షలకు సిద్ధం కండి. 95శాతం మంది అభ్యర్థులు హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకున్నారు. మరో 5శాతం మంది డౌన్లోడ్ చేసుకోండి. ప్రతిపక్షాల మాయమాటలను నమ్మకండి. గత ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు చేపట్టలేదు. మేం వచ్చాకే వేల ఉద్యోగాలు కల్పిస్తున్నాం" అని సీఎం రేవంత్ చెప్పారు. గ్రూప్– 1 పరీక్షల కోసం ఎన్నో ఏళ్లుగా నిరుద్యోగులు నిరీక్షిస్తున్నారని, ఎదురుచూపులు, కాలయాపనకు ఫుల్‌స్టాప్ పెట్టాలని ఎగ్జామ్స్ నిర్వహిస్తున్నామని సీఎం వెల్లడించారు. పోలీసు డ్యూటీ మీట్ ......(తరువాయి 4లో)



## తెగని లొల్లి...

- గ్రూప్ -1 అభ్యర్థుల ఉద్యమబాట
- సచివాలయం ముట్టడి
- పోలీసుల లాఠీచార్జ్
- మద్దతుగా వెళ్ళిన కేంద్రమంత్రి బండి సంజయ్
- అరెస్టు చేసిన పోలీసులు
- సచివాలయం ర్యాలీలో తీవ్ర ఉద్రిక్తత

4



## ముత్యాలమ్మ ఆలయం వద్ద ఉద్రిక్తత

3

- నిరసనకారులపై పోలీసుల లాఠీఛార్జ్
- సికింద్రాబాద్‌లో ఇంటర్నెట్ నిలిపివేత
- దాడిని ఖండించిన ఎమ్మెల్యే రాజాసింగ్

## మూసీ ప్రాంతంలో నివాసం ఉంటా..



- సవాల్ పై నిలబడతారా..?
- సీఎం సవాల్ కు కిషన్ రెడ్డి ప్రతిసవాల్....
- పేదల ఇళ్లు కూల్చితే ఊరుకోమని హెచ్చరిక..
- పేదలకు అక్కర్లేని పనులతో ఒరిగేదేమి ఉండదని హితవు..

3

# రేవంత్ తీరుతో రాజ్యాంగ స్ఫూర్తికి తూట్లు..

- జీఓ 29 తో రిజర్వేషన్ లో అవకతవకలు
- కేసీఆర్ హయాంలో అందరికి ఆమోదయోగ్య మైన జీఓ 55
- రేవంత్ రెడ్డి సెక్యూరిటీ లేకుండా అశోక్ నగర్ కి వెళ్ళాలి
- విద్యార్థుల కోసం బీఆర్ఎస్ పోరాటం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు

జనపదం, సిద్దిపేట బ్యూరో:

తెలంగాణ రాష్ట్రం లో ఉద్యోగాల కేటాయింపులో రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెచ్చిన జి ఓ 29 తో రాజ్యాంగం ఇచ్చిన రిజర్వేషన్ స్ఫూర్తికి తూట్లు పొడుస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. శనివారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువత పై కాంగ్రెస్ ప్రభుత్వ వికృత దాడిని ఖండిస్తున్నామన్నారు. భారత రాజ్యాంగం ఆధారంగా దేశం నడుస్తుందని రేవంత్ ప్రభుత్వం రిజర్వేషన్ల అమలుకు లో రాజ్యాంగ స్ఫూర్తికి తూట్లు పొడుస్తున్నారని మండిపడ్డారు.

**కేసీఆర్ హయాంలో న్యాయం..**

కేసీఆర్ హయంలో జీఓ 55 అమలు చేశామని ఈ ప్రభుత్వం జీవో 29 తెచ్చి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అన్యాయం చేస్తోందన్నారు. 29 జీవోతో పై తరగతుల మెరిట్ విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ చేతిలో రాజ్యాంగం పట్టుకుని తిరుగుతారని ఇక్కడ మాత్రం



రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారన్నారు. ఏ రాజ్యాంగం భగవద్గీత అని రేవంత్ చెబుతున్నారో ఆ రాజ్యాంగాన్ని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. దళితులకు, బీసీలకు, బలహీన వర్గాలకు అన్యాయం చేయడమే కాంగ్రెస్ పాలసీ కావొచ్చన్నారు.

**భట్టి పట్టించుకోవడం లేదు..**

దళిత వర్గానికి చెందిన భట్టి విక్రమార్క కూడా పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. కాంగ్రెస్ లో ఉన్న దళిత, బలహీన, మైనార్టీ వర్గాల ఎమ్మెల్యేలు, మంత్రులు, ప్రజాప్రతినిధులు సీఎం రేవంత్ రెడ్డిని నిలదీయాలని సూచించారు. యూపీఎస్ సి లో కూడా రిజర్వేషన్లు అమలు అవుతాయని ......(తరువాయి 4లో)

## రైతు భరోసా గోవిందా...

- ఇప్పటికైతే మంగళమే.. రబీకి చూద్దాం..
- సబ్ కమిటీ నివేదిక వచ్చాకే యథావిధిగా...
- తేల్చిచెప్పిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల
- నెలాఖరులోగా రూ.2 లక్షలలోపు రుణాల మాఫీ చేస్తామని వివరణ...



3

## రిజర్వేషన్లను రద్దు చేసే కుట్ర

- సోనియా జన్మదినం - నిరుద్యోగుల బలిదినం కాబోతుంది
- గ్రూప్ -1 పరీక్షలను రీషెడ్యూల్ చేయాల్సిందే
- కేంద్రమంత్రి బండి సంజయ్

4

## కట్టెపెట్టినా ఆగేదుండదు..

- ఇందిరమ్మ ఇళ్లకు వేళయ్యింది..
- ఈనెల చివరి నాటికి నియోజకవర్గానికి 4 వేల ఇండ్లు..
- నాలుగేళ్లలో 20 లక్షల నిర్మాణాలే లక్ష్యం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- గోషామహల్ నియోజకవర్గ లబ్దిదారులకు డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీ



## పోస్ట్ పోన్..

- మంత్రివర్గ సమావేశం 26 కి వాయిదా..
- వివరాలు వెల్లడించిన సీఎస్ శాంతకుమారి

జనపదం, హైదరాబాద్ సిటీ : రాష్ట్ర మంత్రివర్గ సమావేశం వాయిపడింది. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 23న జరగాల్సి ఉండగా 26వ తేదీకి వాయిదా వేసినట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వెల్లడించారు. 26న సాయంత్రం 4 గంటలకు సీఎం రేవంత్ అధ్యక్షతన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. అయితే, కేబినెట్ మీటింగ్ వాయిదాపడడానికి కారణాలు తెలియరాలేదు. కేబినెట్ మీటింగ్‌లో ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలతో పాటు హైడ్రా ఆర్డినెన్స్‌కు చట్టబద్ధత కల్పించడం, రెవెన్యూ చట్టం, మూసీ బాధితుల అంశం, వరద నష్టం, రైతు భరోసా తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలుస్తున్నది. ఈ మేరకు వివరాలను సిద్ధం చేయాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇక అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం.

## నాయనమ్మను హత్య చేసిన మనవడు..

**జనపదం, మేడ్చల్:** మద్యం మత్తులో మనవడు నాయనమ్మను హత్యచేశాడు. ఈ విషాదకర ఘటనమేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రావల్కోల్ గ్రామంలో నివాసం ఉంటున్న బాలమ్మ(66)ను ఆమె మనవడు ప్రశాంత్ శుక్రవారం అర్ధరాత్రి ఇంట్లోని చిన్న సిలిండర్ తో తలపై కొట్టాడు. దీంతో తల పగలి అక్కడికక్కడే మృతి చెందింది. బందెల బాలమ్మ కొడుకు మధు కుమారుడు ప్రశాంత్ తనకు డబ్బులు ఇవ్వాలని ఇంటి సభ్యులను కోరగా డబ్బులు ఇచ్చేందుకు నిరాకరించడంతో కల్లు తాగి మత్తులో బాలమ్మ (66)ను హత్య చేశాడు. అంతకు ముందు అతడి తండ్రి మధును సైతం విచక్షణ రహితంగా కొట్టినట్లు సమాచారం. నిందితుడు తండ్రి ఫిర్యాదు మేరకు మేడ్చల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



## టీమిండియా 462 ఆలౌట్

### కివీస్ లక్ష్యం 107 పరుగులు

**జనపదం, బెంగళూరు :** భారత్ వర్సెస్ న్యూజిలాండ్ తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్ లో టీమిండియా 462 వద్ద ఆలౌట్ అయ్యింది. ఇప్పుడు కివీస్ ముందు 107 పరుగుల లక్ష్యాన్ని నెలకొల్పింది. సర్ఫరాజ్ ఖాన్ 195 బంతుల్లో 18 ఫోర్లు, 3 సిక్స్ లతో భారీ సెంచరీని నమోదు చేశాడు. రిషభ్ పంత్ సైతం గాయం నుంచి కోలుకుని 105 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్స్ లతో చెలరేగాడు. అయితే, పంత్ రెప్పపాటు క్షణంలో సెంచరీని మిస్ చేసుకున్నాడు. 400/3తో గట్టి పోటీనిచ్చిన టీమిండియా కివీస్ బౌలర్ల దాటికి ఒక్క సారిగా కుప్పకూలింది. కొత్త బాల్ అందుకోగానే న్యూజిలాండ్ ఆటగాళ్లు విశ్వరూపం చూపించారు. దీంతో భారత్ వేగంగా వికెట్లను కోల్పోవలసి వచ్చింది. 62 పరుగులు మాత్రమే చేసి ఏడు వికెట్లను కోల్పోయింది. తొలి ఇన్నింగ్స్‌లో టీమ్ఇండియా 46 పరుగులకు ఆలౌట్ కాగా.. కివీస్ 402 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. న్యూజిలాండ్ తరపున విలియం ఒరూర్క్, మాట్ హెన్రీ చెరో మూడు వికెట్లు తీయగా, అజాజ్ పటేల్ రెండు, టిమ్ సౌథీ, గ్లెన్ ఫిలిప్స్ ఒక్కో వికెట్ తీశారు. భారత ప్లేయర్లు విరాట్ కోహ్లీ (70), రోహిత్ (52), జైస్వాల్ (32) పరుగులు చేశారు. కేఎల్ రాహుల్ (12), రవీంద్ర జడేజా (5), అశ్విన్ (15)తో సరిపెట్టారు. అయితే, వెలుతురు తక్కువ ఉన్న కారణంగా మరోసారి మ్యాచ్ కు అంతరాయం ఏర్పడింది. నాలుగో రోజు ఆటలో భాగంగా న్యూజిలాండ్ ఆధిక్యాన్ని తగ్గించేందుకు బరిలోకి దిగిన భారత్ కివీస్ ముందు భారీ లక్ష్యాన్ని ఉంచేందుకు శతవిధాలా ప్రయత్నించింది. అయినప్పటికీ తక్కువ స్కోరుతోనే వెనుదిరిగింది.

## అకాల వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యం

### అన్నదాతల ఆందోళన

**జనపదం, మెదక్ :** ఆరుగాలం కష్టపడి పండించిన పంట వర్షార్పణం అయ్యింది. అకాల వర్షానికి ఆరబోసిన ధాన్యం కొట్టుకుపోతుంటే అన్నదాతలు గుండెలు బరువెక్కాయి. మెదక్ పట్టణ శివారులో శనివారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి పిల్లి కొట్టాల్, మెదక్ మార్కెట్ యార్డ్ లో ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయింది. మెదక్ జిల్లాలో ఈ ఖరీఫ్ లో 2.97 లక్షల ఎకరాల్లో వరి పంట సాగైంది. ఇందులో కొనుగోలు కేంద్రాలకు సన్నరకం 1.20 లక్షల మెట్రిక్ టన్నులు, దొడ్డురకం 2.80 లక్షల మెట్రిక్ టన్నులు కలిపి మొత్తం 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఇందుకోసం పీఏసీఎస్, ఐకేపీ, సివిల్ సప్లై, ఎఫ్ పీవోల ఆధ్వర్యంలో మొత్తం 484 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. హార్వెస్టింగ్ ముమ్మరంగా సాగుతుంది. తేమ ఎక్కువగా ఉండడంతో రైతులు అరుబయట ఆరబోస్తున్నారు. అకాల వర్షాలు అన్నదాతలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి.

## మహా వికాస్ అఘాడీలో విభేదాల్లేవు

- కూటమిలో సీట్ల పంపకంపై త్వరలో క్లారిటీ
- ఎన్నికల ఇన్‌చార్జి రమేశ్ చెన్నితాల

**జనపదం, ముంబై:** మహారాష్ట్రలోని ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ కూటమిలో ఎలాంటి విభేదాలు లేవని, అందరం కలిసే ఉన్నామని ఆ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి రమేశ్ చెన్నితాల చెప్పారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోనూ తాము కలిసికట్టుగానే పోటీ చేయబోతున్నామని ఆయన స్పష్టంచేశారు. ఎవరు ఎన్ని స్థానాల్లో పోటీ చేయాలనే విషయంలో సంప్రదింపులు జరుగుతున్నాయన్నారు. సీట్ల పంపకంపై కూటమిలోని మూడు పార్టీల నుంచి నానా పటోల్, సంజయ్ రౌత్, జయంత్ పాటిల్ కసరత్తు చేస్తున్నారని తెలిపారు.

# మూసీకి అడ్డుపడితే.. మరో ఉద్యమమే..

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

**జనపదం, హైదరాబాద్ సిటీ:** నల్గొండ, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లోని దాదాపు కోటిమంది ప్రజల జీవితాలతో ముడిపడ్డ మూసీ శుద్ధీకరణను అడ్డుకుంటే ఆనాటి రజాకార్లపై తిరుగుబాటు, తెలంగాణ తొలిదశ, మలిదశ ఉద్యమం మళ్లీ పునరావృతం అవుతుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హెచ్చరించారు. సచివాలయంలో మీడియాతో మాట్లాడిన మంత్రి మూసీ కాలుష్యంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్న నల్గొండ జిల్లా ప్రజలను వివరిస్తూ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో అన్యాయం జరిగిందనే తెలంగాణ రాష్ట్రాన్ని పోరాడి సాధించుకుంటే.. గడిచిన పదేండ్లలో నల్గొండ జిల్లాకు తీరని అన్యాయం చేశారని ఆయన మండిపడ్డారు. నల్గొండ ప్రజల్ని నాయకులు రెచ్చగొడుతున్నారని చెబుతున్న కేటీఆర్ మాటలు పూర్తిగా సత్యదూరమని చెప్పిన ఆయన నల్గొండ ప్రజలు రెచ్చగొడితే రెచ్చిపోయేంత అమాయకులు కాదని స్వతహాగా పౌరుషం ఉన్న వ్యక్తులమని ఆయన అన్నారు. మూసీకి అడ్డుపడే ప్రతీ రాజకీయ పార్టీని నల్గొండ, రంగారెడ్డి, హైదరాబాద్ లో ప్రజలు నామరూపాలు



లేకుండా చేస్తారని ఆయన హెచ్చరించారు. కేసీఆర్ మోసాలకు ఇప్పటికే నల్గొండ నరకయాతన పడుతున్నదని.. ఇప్పుడు ఆయన కొడుకు మోపయ్యిండని ఆక్షేపించారు. ఎవ్వరు అడ్డువచ్చిన మూసీ విషయంలో వెనకడుగువేసే పరిస్థితే లేదని తేల్చిచెప్పారు. కాళేశ్వరం డీపీఆర్ కు 2015 లోనే 33 కోట్లు చెల్లించారని.. ఇప్పుడు 140 కోట్లు చెల్లిస్తుంటే గగ్గోలు పెడుతున్నరని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మాట్లాడటం వచ్చని అబద్ధాలు చెప్పి ప్రజల్ని నమ్మించాలనుకుంటే తెలంగాణ ప్రజలు అమాయకులు కాదని.. కేసిఆర్ కుటుంబ మోసాల్ని ప్రజలు పసిగట్టిను కనుకనే 16 కు 16 స్థానాల్లో గుణపాఠం చెప్పారని ఎద్దేవా చేశారు.

### అహంకారం తగ్గలే..

కేటీఆర్ కు అధికారం పోయినా అహంకారం తగ్గలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. లేదంటే దేశప్రధానికి జూమ్లా పీఎం – రాష్ట్రముఖ్యమంత్రిని హౌలా సీఎం అని చెప్పడం ఏంటని ప్రశ్నించారు. నల్గొండలో పుట్టిన చిట్టి నాయుడు ఒకరు మొన్నటి ఎన్నికల్లో 3 వేల ఓట్లతో గెలిచినప్పటికి ఆయనకు నల్గొండ సమస్యలు పట్టవని అన్నారు.. బస్సు కిరాయిలు లేనోడికి ఇప్పుడు 80 ఎకరాల ఫామ్ హౌజ్ ఉందని.. ఉప్పల్ లో వాటర్ ప్లాంట్ పెట్టి నడిపిన వ్యక్తి.. కేసీఆర్ కు ఉన్నంత ఫామ్ హౌజ్ ఎట్లా వచ్చిందని ప్రశ్నించారు. అధికారం అడ్డం పెట్టుకొని పది వేల కోట్లు దోచుకున్న ఆ చిట్టినాయుడు.. ఎప్పుడు నల్గొండ బిడ్డల బాగుకోసం పనిచేయలేదని ఆరోపించారు.. మొన్నటి ఎన్నికల్లో మా అభ్యర్థి దామోదర్ రెడ్డికి మోకాలి ఆపరేషన్ కావడంతో చిట్టి నాయుడు బతికిబయటపడ్డదని లేదంటే యాభైవేల మెజార్టీతో ఇంటికి పంపేవాళ్లమని తేల్చిచెప్పారు.

# అనాథల కోసం భవిష్యజ్యోతి

- ట్రస్ట్ ఏర్పాటు అభినందనీయం
- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు...
- దాతలు తోడ్పాటును అందించాలని పిలుపు...
- పాల్గొన్న జిల్లా జడ్జి, సీ.పీ, బెటాలియన్ కమాండెంట్




**జనపదం, నిజామాబాద్:** అనాథ బాలలకు నాణ్యమైన విద్యను అందించి వారి ఉజ్వల భవితకు బాటలు వేయాలనే మహోన్నత సంకల్పంతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో భవిష్యజ్యోతి ట్రస్ట్ ను నెలకొల్పడం అభినందనీయమని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో అనాథ పిల్లల కోసం ఏర్పాటైన ట్రస్ట్ ను శనివారం కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కోర్టు భవన సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా సెషన్స్ జడ్జి సునీత కుంచాల అధ్యక్షత వహించగా, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, డిచ్ పల్లి పోలీస్ బెటాలియన్ కమాండెంట్ రోహిణి ప్రియదర్శిని తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... నా అనేవారెవరు లేని బాలికలకు ప్రాథమిక దశ నుంచే నాణ్యమైన విద్యను అందించి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలనే దృక్పథంతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నెలకొల్పిన ట్రస్ట్ కు జిల్లా యంత్రాంగం తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. సాధారణంగా న్యాయ సేవాధికార సంస్థలు లోక్ అదాలత్ ల నిర్వహణ, న్యాయ పరమైన అంశాలపై అవగాహన సదస్సులు వంటి వాటికే పరిమితమవుతాయని, అందుకు భిన్నంగా నిజామాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ విస్తృత స్థాయిలో సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తుండడం అభినందనీయమన్నారు. స్వీయ రక్షణ కోసం రికార్డు స్థాయిలో 11 వేల మంది బాలికలకు కరాటేలో శిక్షణ ఇప్పించడం, గ్రామాభివృద్ధి కమిటీల పనితీరును పెంపొందించే కార్యక్రమాలను నిర్వహించడం వంటి అనేకానేక కార్యక్రమాలను డీఎల్ఎస్ఏ చేపట్టిందని గుర్తు చేశారు. ఇదే కోవలో అనాథ బాలలకు మెరుగైన విద్యను అందించాలనే సదాశయంతో ట్రస్ట్ ను నెలకొల్పడం అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనాథ బాలలకు ఉచితంగా ప్రవేశాలు కల్పించిన కాకతీయ స్కూల్, రవి పబ్లిక్ స్కూల్, నిర్మల హృదయ్ పాఠశాలల యాజమాన్యాలను కలెక్టర్ ఈ సందర్భంగా అభినందించారు. జిల్లా జడ్జి కుంచాల సునీత మాట్లాడుతూ.. నిజామాబాద్ లోని బాలసదన్ లో ఆశ్రయం పొందుతున్న అనాథ బాలలకు నాణ్యమైన విద్యను ఇప్పిస్తూ, వారికి అన్ని విధాలుగా తోడ్పాటుగా నిలవాలనే ఆశయంతో భవిష్య జ్యోతి ట్రస్ట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యార్థుల చదువుతో పాటు వారికి అవసరమైన ఇతర సదుపాయాలన్ని ట్రస్ట్ ద్వారా సమకూరుస్తామని తెలిపారు. ట్రస్ట్ పేరిట ప్రత్యేకంగా నిజామాబాద్ నగరంలోని ఐ.సీ.ఐ.సీ.ఐ బ్యాంకు, నాందేవ్ వాడ బ్రాంచ్ లో అకౌంట్ ను తెరవడం జరిగిందన్నారు. దాతలు తమ విరాళాలను భవిష్య జ్యోతి, అకౌంట్ నెంబర్: 354705001646, ఐ.ఎఫ్.ఎస్.సీ కోడ్: ఐసీఐసీ003547, ఐసీఐసీఐ బ్యాంకు, నాందేవ్ వాడ బ్రాంచ్ లో జమ చేయవచ్చని సూచించారు. పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ మాట్లాడుతూ, అనాథ బాలలను దత్తత తీసుకునే అవకాశం కలగడాన్ని తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో సెకండ్ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి టీ.శ్రీనివాస్, ప్రైవేట్ విద్య సంస్థల నిర్వాహకులు రజనీకాంత్, సరళా మహేందర్, న్యాయాధికారులు, బాలసదన్ చిన్నారులు పాల్గొన్నారు.

# ఆక్రమణదారులే అడ్డుకుంటున్నారు

- రాష్ట్ర ఆర్థిక మూలాలు దెబ్బతీసే ప్రయత్నం
- కేసీఆర్ కుటుంబానిది దోపిడి చరిత్ర
- హరీశ్ రావుకు ఫాంహౌస్ లేదా..?
- హరీశ్ కాదు.. ఫాంహౌస్లో పడుకున్నోళ్లను రమ్మను.. నేనూ వస్తా
- రాజీవ్ గాంధీ సద్భావన యాత్రలో సీఎం రేవంత్ రెడ్డి




**జనపదం, హైదరాబాద్ బ్యూరో:** బీఆర్ఎస్ నేతల ఫామ్ హౌస్ డ్రైనేజీ నీటిని పేదలకు వేళ్లే తాగునీటిలో కలుపుతారా అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతల తాపత్రయమంతా ఫామ్‌హౌస్‌లు కాపాడుకోవడానికేనని, మూసీ పునరుజ్జీవం వేరు.. హైడ్రా వేరని సీఎం స్పష్టం చేశారు. తెలంగాణ ఆర్థిక మూలాలు దెబ్బతీయాలని కొంత మంది చూస్తున్నారని, హైదరాబాద్ ప్రతిష్టను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. తమ ప్రభుత్వం అలాంటివారి భరతం పడుతుందని హెచ్చరించారు. హైడ్రా అనగానే కేటీఆర్, హరీశ్‌రావు, ఈటల రాజేందర్ బయటకు వచ్చారని.. పేదలు ఎవరైనా ఫామ్‌హౌస్‌లు కట్టుకోగలరా అని ప్రశ్నించారు. చార్మినార్ వద్ద నిర్వహించిన రాజీవ్ సద్భావన యాత్ర స్మారక దినోత్సవ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. దేశ సమగ్రత కోసం 34ఏళ్ల క్రితం రాజీవ్ గాంధీ సద్భావన యాత్ర చేపట్టారని ప్రతి ఏటా వారి స్ఫూర్తిని కొనసాగిస్తూ ముందుకు వెళుతున్నామని వివరించారు. ఈ సందర్భంగా హైడ్రాకు కొందరు అడ్డుపడుతున్నారని సీఎం ఘాటుగా స్పందించారు. గాంధీ కుటుంబంతో కేసీఆర్ కుటుంబానికి ఏమైనా పోలిక ఉందా? అని నిలదీశారు. ప్రధాన మంత్రి పదవినే త్యాగం చేసిన చరిత్ర సోనియా గాంధీది అని సీఎం చెప్పారు. మాజీ మంత్రి గీతారెడ్డికి రాజీవ్ గాంధీ సద్భావనా అవార్డును సీఎం రేవంత్ రెడ్డి ప్రదానం చేశారు.

### కేసీఆర్ కుటుంబానిది దోపిడి చరిత్ర..

పదేండ్లు రాష్ట్రాన్ని నాశనం చేశారని, కనిపించిన భూములను మాయం చేశారని, కేసీఆర్ కుటుంబానిది దోపిడీ చరిత్ర అని సీఎం రేవంత్రెడ్డి ఆరోపించారు. ఆక్రమణదారులే హైడ్రాను చూసి భయపడుతున్నారని, మూసీ మురికిలో ఉన్న పేదలను ఆదుకోవడానికి తాము ప్రయత్నిస్తున్నామని చెప్పారు. బుల్డోజర్లను కూడా సిద్ధం చేశా.. ఎవరు అడ్డం వస్తారో రావాలని హెచ్చరించారు. వాళ్ల ఫామ్ హౌస్‌లపైకి బుల్డోజర్లు వస్తాయనే భయంతో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, బీఆర్ఎస్ నేతలు నాటకాలు ఆడుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. తన ఇంటి ముందుకొచ్చి చేతులు కట్టుకున్న రోజులను హరీశ్‌రావు మర్చిపోయారా అని ప్రశ్నించారు. హైడ్రా ఆక్రమణలకు పాల్పడ్డ బడాబాబులు రాష్ట్ర ఆర్థిక మూలాలను దెబ్బతీయాలని ప్రయత్నిస్తున్నారని, రియల్ ఎస్టేట్ సంస్థలు భయపడొద్దని తాను హామీ ఇస్తున్నానని, ప్రభుత్వం అండగా ఉంటుందని వెల్లడించారు. అజీజ్‌నగర్‌లో హరీశ్‌రావుకు ఫాంహౌస్ లేదా అని ప్రశ్నించారు. గతంలో కాంగ్రెస్ వల్లనే హరీశ్‌రావుకు మంత్రి పదవి వచ్చిందన్నారు. హైడ్రా ఆగదని అక్రమార్కులకు కంటి మీద కునుకు ఉండదని చెప్పారు.

### గాంధీ కుటుంబంతో పేదలకు మేలు..

దేశ సమగ్రత కోసం రాజీవ్ గాంధీ 34 ఏళ్ల క్రితం సద్భావన యాత్ర చేపట్టారని, ప్రతి ఏడాది అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ వస్తున్నామని సీఎం రేవంత్రెడ్డి వెల్లడించారు. సుదీర్ఘ కాలం ప్రజలకు సేవలు అందించిన మాజీ మంత్రి గీతా రెడ్డిని సద్భావన అవార్డుకు ఎంపిక చేసినందుకు సంతోషంగా ఉందని, రాజకీయాల్లో ఉంటే పదవుల కోసం పాకులాడే వారిని చూశా కానీ గత ఎన్నికల్లో ఏమీ ఆశించకపోగా, పోటీ చేయని గొప్ప వ్యక్తి గీతారెడ్డి' అని పేర్కొన్నారు. గాంధీ కుటుంబం తీసుకున్న నిర్ణయాలతోనే దేశంలో పేదలకు మేలు జరిగిందని, పేదలకు మేలు జరిగేది గాంధీకుటుంబంతో మాత్రమేనని, మాజీ ప్రధానులు ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ దేశం కోసం ప్రాణాలు అర్పించారని అందరికీ తెలుసునన్నారు. సోనియా, రాహుల్ గాంధీ ప్రధాని పదవులను త్యాగం చేశారని, గాంధీ కుటుంబానికి, దోపిడీ చరిత్ర ఉన్న వారికి ఏమైనా పోలిక ఉందా అని ప్రశ్నించారు.

### బిల్లా రంగాలు అడ్డుపడుతున్నారు..

ఆక్రమణలకు పాల్పడ్డ బడా బాబుల పట్ల భూతం హైడ్రా అని రేవంత్ రెడ్డి అన్నారు. నాళాలు, చెరువులను, ప్రభుత్వ భూములను, ఆక్రమించుకుని పెద్ద పెద్ద బిల్డింగులు, ఫాంహౌస్‌లు కట్టిన వారిపై హైడ్రా ఉక్కుపాదం మోపుతోందని, అక్రమాలకు పాల్పడిన మదపుటేనుగులను అణచడానికి హైడ్రా అంకుశంలా పనిచేస్తుందన్నారు. అయితే కొందరు ఉద్దేశపూర్వకంగా హైడ్రాను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకుని హైడ్రా వారిపై చర్యలు తీసుకుంటుంటే బిల్లా రంగాలు వచ్చి బుల్డోజర్లకు అడ్డు పడతామంటున్నారని, మూసీ వద్దకు కాదు, జన్వాడ ఫామ్ హౌస్ కు పోదాం అని సవాల్ చేశారు. గుల్బాపూర్ నాలాను ఆక్రమించుకుని కేటీఆర్ ఫామ్ హౌస్ కట్టలేదా? అని రేవంత్ ప్రశ్నించారు. ఫామ్ హౌస్ కు బుల్డోజర్ వస్తుందనే బీఆర్ఎస్ నేతలు డ్రామాలు చేస్తున్నారని మండిపడ్డారు. "హరీశ్.. నీలాంటి వాళ్లు కాదు.. ఫామ్ హౌస్ లో పడుకున్న వాళ్లను రమ్మను, నేను కూడా వస్తా.. నీది ఒక స్థాయేనా" అని సీఎం ఘాటు వ్యాఖ్యలు చేశారు. మూసీ పునరుజ్జీవనం వేరు, హైడ్రా వేరు అని, మూసీలో ఎలాంటి కూల్చివేతలు చేపట్టలేదన్నారు. ట్రాఫిక్ సమస్య, నాళాల పునరుద్ధరణకు అడ్డుకట్ట వేయడానికే హైడ్రా పనిచేస్తోందని, బీఆర్ఎస్ నేతలు చెప్పినట్టు అక్కడికి ఇక్కడికి కాదు, ఫామ్ హౌస్ కు రమ్మని సవాల్ చేశారా? అని ప్రశ్నించారు. వాళ్ల ఫామ్ హౌస్ ల వద్దకు ఎప్పుడు రావాలో అది కూడా హరీష్ రావు చెప్పాలన్నారు. హరీశ్ రావు, కేటీఆర్ ఫామ్ హౌస్ లకు సంబంధించి అఖిలపక్షం పిలిచి, నిజ నిర్ధారణ కమిటీతో నిజాలు ఏంటో తేల్చేద్దామని పిలుపునిచ్చారు.

## కేటీఆర్ అక్కసులో అర్థం లేదు

**మూసీ ప్రక్షాళనపై చిత్తశుద్ధి ఉంటే యూటర్న్ డ్రామాలెందుకు**

**మూసీ పునరుజ్జీవ యజ్ఞంలో ఎవరికీ నష్టం జరగనివ్వం**

**ప్రజలు తరలుతుంటే విపక్షాలకు చెమటలు పడుతున్నాయి**

**రాష్ట్ర మంత్రి సీతక్క**

**జనపదం, హైదరాబాద్ సిటీ:** మూసీ నది పునరుజ్జీవం పై మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపణల్లో పస లేదని, ఆయన అక్కసులో అర్థం లేదని మంత్రి డాక్టర్ సీతక్క మండిపడ్డారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును మొదట్లో వ్యతిరేకించిన కేటీఆర్.. ఇప్పుడు ప్రజాగ్రహానికి తలొగ్గి తాము వ్యతిరేకం కాదని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని, పిల్లి మొగ్గలు వేస్తున్నారని ఎద్దేవా చేసారు. మూసీ డీపీఆర్ ఎప్పుడో సిద్ధం చేసామని చెబుతున్న కేటీఆర్ పదేండ్లుగా అధికారంలో ఉండి మూసీ నీటిని కనీసం ఎందుకు శుద్ధి చేయలేకపోయారని ప్రశ్నించారు. నిజంగా మూసీ ప్రక్షాళన పట్ల చిత్తశుద్ధి ఉంటే, ఇప్పుడు యూటర్న్ తీసుకోవాల్సిన అవసరం ఎందుకు వచ్చిందని,



అభూత కల్పనలకు, ఆకాశానికి నిచ్చెనలు వేయడంలో కేటీఆర్ దిట్ట అని పేర్కొన్నారు. ఎలాంటి డీపీఆర్ లేకుండానే కాళేశ్వరం పేరుతో లక్ష కోట్లను గోదారి పాలు చేసిన బీఆర్ఎస్ నేతలకు, డీపీఆర్ గురించి మాట్లాడే కనీస అర్హత లేదన్నారు. తామే మూసీ ప్రక్షాళనను మొదలు పెట్టామని ఓ వైపు గొప్పగా చెబుతూనే మరో వైపు మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును ఎందుకు వ్యతిరేకించాల్సి వస్తుందో కేటీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. కాలమైతే మీ ఖాతా లో, కరువొస్తే పక్కడి ఖాతాలో వేసే విధానాన్ని మానుకోవాలన్నారు. ఒకప్పుడు నాంపల్లి, ఖైరతాబాద్ మండలాలకే పరిమితమైన హైదరాబాద్ నగరాన్ని నలదిక్కులా విస్తరించి విశ్వ నగరంగా మార్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాలదే అని తెలిపారు. వండిన కుండలాంటి హైదరాబాద్ ను వడ్డించుకు తిన్నది బీఆర్ఎస్ నేతలు కాదా అని మంత్రి సీతక్క ప్రశ్నించారు. రాజధాని హైదరాబాద్ నగరానికి పురుడు పోసిన మూసీని కాపాడుకోవడానికి తమ ప్రజా ప్రభుత్వం ప్రయత్నిస్తుందని మంత్రి సీతక్క పునరుద్ఘాటించారు. మూసీకి పునరుజ్జీవం పోసే మహా యజ్ఞంలో ఎవరికి అన్యాయం జరగదని వెల్లడించారు. మూసీ నదీ గర్భంలో ఉన్న ఒక్కొక్క కుటుంబాన్ని ఒప్పించి మెప్పించి అన్ని రకాలుగా చేయూతనిచ్చి మరో చోట వాళ్లకు స్థిర నివాసం ఏర్పాటు చేసి, పునరావాసం కల్పించిన తర్వాతే ఇండ్లు ఖాళీ చేస్తున్నామని తెలిపారు. ప్రజా ప్రభుత్వం పై నమ్మకంతో మూసీ పరివాహక ప్రాంత ప్రజలు స్వచ్ఛందంగా ఇల్లు ఖాళీ చేసి వెళ్తుంటే..కేటీఆర్ తట్టుకోలేక లేని పోని ఆరోపణలు చేస్తున్నారని మంత్రి సీతక్క మండిపడ్డారు.

# రేవంత్‌పై బండికి ఎందుకంతా ప్రేమ..?

- ఆయన సీటుకు ఎసరొస్తే నీకేం బాధ..
- నిరుద్యోగులపై లాఠీచార్జ్ చేస్తే ఏం చేశారు..
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



**జనపదం, హైదరాబాద్:** బండి సజయ్ కేంద్ర సహాయ మంత్రా.. లేక సీఎం రేవంత్ సలహాదారా.. అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శించారు. రేవంత్ రెడ్డిని దించేందుకు కాంగ్రెస్ మంత్రులు ప్రయత్నిస్తున్నారంటూ కేంద్ర హోంశాఖ సహాయమంత్రి, బీజేపీ ఎంపీ బండి సంజయ్ వ్యాఖ్యలపై శనివారం ఆయన స్పందించారు. రేవంత్ కుర్చీ గురించి .. బండి సంజయ్ కి ఎందుకు బాధ అని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటే ఏంటి..? ఊడితే ఏంటి..?, రేవంత్ సీఎం సీటులో ఉంటే ఏంటి ? ఉండకపోతే ఏంటి..? అని ప్రశ్నించారు. రేవంత్ కు ప్రజల్లో వ్యతిరేకత పెంచుతున్న కాంగ్రెస్ నేతలు ఎవరు..? రేవంత్ ను దించబోయే కాంగ్రెస్ మంత్రులు ఎవరో కూడా బండి సంజయ్ వెల్లడిస్తే బాగుండేదన్నారు. మూసీ ప్రజల గోడు బీజేపీ నేతలకు పట్టదా అని నిలదీశారు. ఎన్నికలకు ముందు నిరుద్యోగుల సమస్యలపై ఒంటి కాలి మీద లేచిన బండి సంజయ్ ఇప్పుడెందుకు గర్జించడం లేదో చెప్పాలన్నారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న నిరుద్యోగుల మీద లాఠీఛార్జ్ చేస్తుంటే రాష్ట్రం నుంచి కేంద్ర హోంశాఖ సహాయమంత్రిగా పనిచేస్తున్న బండి సంజయ్ కి కనపడడం లేదా అన్నారు. అశోక్ నగర్ లో అప్రకటిత కర్ఫ్యూ కొనసాగుతుంటే బీజేపీ నేతలు ఎందుకు కిక్కురుమనడం లేదన్నారు. మూసీ బాధితులు నెత్తి నోరు బాదుకుంటుంటే బీజేపీ నేతలలో చలనం ఎందుకు లేదని నిలదీశారు. అవసరమైతే అశోక్ నగర్ వెళ్తా అంటున్న బండి సంజయ్ మాటల వెనక మర్మం ఏంటి ? ఇప్పుడు ఓట్ల అవసరం లేదనా ? ఓట్ల అవసరం ఉన్నప్పుడు వస్తా అన్నట్లు ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ పాలన నడుస్తుంది.. రేవంత్ ప్రభుత్వానికి బీజేపీ నేతలు భేషరతుగా అనధికారిక మద్దతు ఇస్తున్నారని, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలది దేశంలో కుస్తీ.. తెలంగాణలో దోస్తీ సాగుతోందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆరోపించారు.

## జీవో 29లో ఏముంది....

- గ్రూప్ 1 అభ్యర్థుల ఆందోళనలకు కారణం
- సుప్రీంకోర్టు నిర్ణయంపై ఉత్కంఠ



**జనపదం, న్యాయ విభాగం:** తెలంగాణ గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలు వాయిదా వేయాలని.. జీవో 29ను రద్దు చేయాలని.. అభ్యర్థులు పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తున్నారు. దీంతో పోలీసులు పలువురు అభ్యర్థులను అదుపులోకి తీసుకుని వాహనాల్లో తరలించారు. అయితే.. జీవో 29 అంటే ఏమిటి..? ఎందుకు ఆందోళనలు చేస్తున్నారు. జీవో 29ను రద్దు చేయాలంటున్న గ్రూప్ వన్ అభ్యర్థులు.. పాత జీవో 55 ప్రకారమే పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. అటు ప్రభుత్వం మాత్రం నిబంధనలపై వెనక్కి తగ్గేదేలేదంటోంది. జీవో 55 ప్రకారామే పరీక్షలు ఉంటాయని చెబుతోంది. ఇంతకూ జీవో 29 వర్సస్ 55 వివాదం ఏంటి..? ఏ జీవోలో ఏముంది..? హైకోర్టు క్లియరెన్స్ ఇవ్వడంతో సోమవారం నుండి గ్రూప్–1 పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది ప్రభుత్వం. అటు విద్యార్థులు మాత్రం పట్టువీడ్డం లేదు. ప్రభుత్వం రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయడం లేదంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీంతో సుప్రీంకోర్టు ఏం చెబుతుందోనన్న ఆసక్తి నెలకుంది. ఈ నేపథ్యంలో ఈ జీవో వివాదం ఏంటనే చర్చ మొదలయింది.

### 2024లో జీవో 29 తెచ్చిన రేవంత్ ప్రభుత్వం..


కేసీఆర్ ప్రభుత్వం 2022లో జారీ చేసిన గ్రూప్–1 నోటిఫికేషన్‌ను కోర్టు తీర్పుతో 2024 రద్దు చేసింది రేవంత్‌రెడ్డి ప్రభుత్వం. ఆ సమయంలో కొత్త నోటిఫికేషన్‌ను జారీ చేస్తూ..జీవో 29ను తీసుకువచ్చింది. గత ప్రభుత్వం అమలు చేసిన జీవో 55లో 1:50 నిష్పత్తిలో మెయిన్స్‌లో అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఈ క్రమంలో 40 శాతం అభ్యర్థులను మెరిట్ ప్రకారం ఎంపిక చేస్తే.. 60 శాతం అభ్యర్థుల ఎంపికలో రిజర్వేషన్లను వర్తింపు చేస్తారు. దీంతో మెరిట్ ఉన్న రిజర్వుడు అభ్యర్థులు ఓపెన్ కోటాలో ఎంపికవుతారు. మెరిట్ తక్కువ ఉన్న అభ్యర్థులకు..రిజర్వుడు కేటగిరిలో అవకాశం లభిస్తోంది. దీనివల్ల అటు ఓపెన్ కోటాలోనూ..ఇటూ రిజర్వుడు కోటాలో కూడా రిజర్వేషన్లు ఉన్న అభ్యర్థులకు ప్రయోజనం కలుగుతుంది.

### అవకాశాలు కోల్పోతామంటున్నరిజర్వుడు అభ్యర్థులు

రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 29 ప్రకారం..రిజర్వేషన్లతో సంబంధం లేకుండా మెయిన్స్‌లో మెరిట్ ప్రకారం అభ్యర్థుల ఎంపిక ఉంటుంది. ఉద్యోగాల కేటాయింపులోనే రిజర్వేషన్లు వర్తింపు జేస్తారు. అందువల్ల ఓపెన్ కేటగిరీలో ఎంపికైన రిజర్వుడు అభ్యర్థులను కూడా రిజర్వేషన్ కేటగిరీ కిందనే పరిగణిస్తున్నారు. దీనివల్ల రిజర్వుడ్ కేటగిరీలో ఉన్నవారికి అన్యాయం జరుగుతోందని అభ్యర్థుల వాదన. రిజర్వుడ్ అభ్యర్థులకు సంబంధించి రాజ్యాంగ నిబంధనలకు వ్యతిరేకంగా ప్రభుత్వం ఈ జీవోను తీసుకువచ్చిందని ఆరోపిస్తున్నారు అభ్యర్థులు. తమ పిటిషన్‌పై సుప్రీంకోర్టు తీ ర్పు వచ్చేవరకూ పరీక్షను వాయిదా వేయాలని డిమాండ్ చేస్తున్నారు. అటు ప్రభుత్వం మాత్రం పరీక్షల నిర్వహణకే మొగ్గు చూపుతోంది. మరి సుప్రీంకోర్టు ఏం చెబుతుందో చూడాలి.

## భరోసాను ఎగగొట్టటం మోసం..

- తుమ్మల ప్రకటనపై కేటీఆర్ ఆగ్రహం
- వెంటనే ఖాతాలో వేయాల్సిందేనని డిమాండ్
- నేడు మండల కేంద్రాల్లో నిరసనకు పిలుపు..



**జనపదం, హైదరాబాద్ సిటీ:** కేబినెట్ సబ్ కమిటీ నివేదిక ఇచ్చిన తర్వాతే రైతు భరోసా ఇస్తామంటూ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు చేసిన ప్రకటన పై భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి తన ప్రకటన ద్వారా వర్షాకాలం సీజన్ రైతు భరోసాను ఎగ్గొట్టినట్లేనని చెప్పారన్నారు. ఇది కచ్చితంగా రాష్ట్ర రైతాంగాన్ని మోసం చేయటమేనని కేటీఆర్ మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ చర్యకు నిరసనగా ఆదివారం అన్ని మండల కేంద్రాల్లో నిరసన చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డి సర్కార్ రైతు వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రైతు బంధు ను పూర్తిగా ఎత్తి వేసే కుట్రలో భాగంగానే రైతు భరోసా పేరుతో కేబినెట్ సబ్ కమిటీ, కొత్త గైడ్ లైన్స్ అంటూ డ్రామా చేస్తున్నారన్నారు. ఎట్టి పరిస్థితుల్లో రేవంత్ రెడ్డి సర్కార్ రైతులకు చేస్తున్న అన్యాయాన్ని బీఆర్ఎస్ సహించదన్నారు. రేవంత్ రెడ్డి కుట్రలకు బీఆర్ఎస్ కార్యకర్తలు రైతులకు తెలిసేలా చేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతుబంధుకు రాం రాం చెబుతుందని ఎన్నికలకు ముందే కేసీఆర్ చెప్పారని ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తు చేశారు. ఇప్పుడు ఆ మాటలను రేవంత్ రెడ్డి సర్కార్ అక్షరాల నిజం చేసిందన్నారు. వానాకాలం పంట సీజన్ కు రైతు భరోసాను పూర్తిగా ఎగగొట్టి...లక్షలాది మంది రైతుల నోట్లో రేవంత్ రెడ్డి మట్టి కొట్టాడని మండిపడ్డారు. రైతు భరోసా ఇచ్చేందుకు పైసలు లేకపోవటంతోనే సబ్ కమిటీ అంటూ కాలయాపన చేశారని...చివరకు చేతులెత్తేశారని కేటీఆర్ ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతులను ఇబ్బందులకు గురిచేస్తోన్న కాంగ్రెస్ సర్కార్ కు రైతుల ఉసురు తగులుతుందని శాపనార్థాలు పెట్టారు. పేదల కడుపు కొట్టి రూ. లక్షా 50 వేల కోట్లతో మూసీ సుందరీకరణ చేసేందుకు డబ్బులున్నాయి గానీ రైతులకు రూ. 15 వేల కోట్లు ఇచ్చేందుకు పైసలు లేవా అని కేటీఆర్ ప్రశ్నించారు. కేసీఆర్ పదివేలు ముష్టి వేస్తున్నాడు...మేము రూ. 15 వేలు ఇస్తామన్న సిపాయి ఇప్పుడు ఎక్కడ అంటూ కేటీఆర్ నిలదీశారు. రేవంత్ రెడ్డి రైతుల వద్దకు వెళ్తే ఆయన వీపు చింతపండు అవటం ఖాయమన్నారు. పచ్చి అబద్దాలు, మోసాలతో రైతులను కాంగ్రెస్ దగా చేసిందని కేటీఆర్ మండిపడ్డారు. మీ దగాకోరు మాటలు నమ్మిన రైతులను ఇప్పుడు అరిగోస పెడుతున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. రైతులతో చెలగాటమాడుతున్న రేవంత్ సర్కార్ అన్నదాతల ఆగ్రహానికి మాడి మసై పోవటం ఖాయమని హెచ్చరించారు.



## ముగ్గురు మావోయిస్టుల లొంగుబాటు

**జనపదం, కొత్తగూడెం :** చర్ల ఏరియాకు చెందిన ముగ్గురు మావోయిస్టులు శనివారం లొంగి పోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..., ఏరియా కమిటీ సభ్యులు పొడియం మంగు అలియాస్ దేవేందర్, మడివి అడిమే అలియాస్ అనూష, దళ సభ్యుడు కుడం సోమల్ జనజీవన స్రవంతిలో కలవాలని నిర్ణయించుకొని, స్వచ్ఛందంగా లొంగి పోయినట్టు చెప్పారు. ముందుగా ఆపరేషన్ చేయూతలో భాగంగా పోలీసులు వారి కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. వీరు ముగ్గురూ ఐదేళ్ల క్రితం చర్ల ప్లటూన్లో సాయుధ దళ సభ్యులుగా చేరారు. తర్వాత పొడియం మంగు, మడివి అడిమే ఏరియా కమిటీ సభ్యులుగా పదోన్నతి పొందారు. ప్రస్తుతం ముగ్గురూ చర్ల ప్లటూన్లోనే పని చేస్తున్నారు. ఒక్కొక్క రిపై 4 లక్షల రివార్డు వుంది. ఈ సందర్భంగా ఎస్పీ రోహిత్ రాజ్ మాట్లాడుతూ లొంగి పోవాలనుకున్న మావోయిస్టులు, తమ కుటుంబ సభ్యుల ద్వారా దగ్గరలోని పోలీస్ స్టేషన్లో గానీ, జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల సమక్షంలో గానీ నేరుగా లొంగిపోవచ్చని సూచించారు. లొంగి పోయిన మావోయిస్టులకు జీవనోపాధి, పునరావాసం కల్పించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం కృషి చేస్తుందని చెప్పారు.



## కాంగ్రెస్, జేఎంఎం కలిసి 70 స్థానాల్లో పోటీ

### జార్ఖండ్ సీఎంహేమంత్ సోరెన్

**జనపదం, రాంచీ :** జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా కూటమి కలిసికట్టుగా పోటీ చేయనున్నట్లు శనివారం ఆ రాష్ట్ర సీఎం హేమంత్ సోరెన్ ప్రకటించారు. రాష్ట్రంలోని 81 స్థానాల్లో.. కాంగ్రెస్, జేఎంఎం పార్టీలు 70 స్థానాల్లో పోటీ చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. అయితే సీట్ల పంపకం విషయంలో ఇప్పుడే పూర్తి వివరాలను వెల్లడించలేమని, తమ కూటమి పార్టీ ఇప్పుడు తమతో లేదని, వాళ్లు మా వద్దకు వచ్చినప్పుడు, పార్టీ సీట్లను ఫైనలైజ్ చేస్తామని సోరెన్ తెలిపారు. మిగితా 11 స్థానాల కోసం.. ఆర్జేడీ, లెఫ్ట్ పార్టీలతోనూ సీట్ల పంపకం విషయంలో చర్చలు చేపడుతున్నట్లు ఆయన చెప్పారు. జార్ఖండ్‌లో రెండు దశల్లో పోలింగ్ జరగనున్నది. నవంబర్ 13వ తేదీన తొలి దశ, 20వ తేదీన రెండో దశ ఎన్నికలు నిర్వహించనున్నారు. నవంబర్ 23వ తేదీన కౌంటింగ్ ఉంటుంది. గత ఎన్నికల్లో జేఎంఎం 43 స్థానాల్లో, కాంగ్రెస్ 31 స్థానాల్లో పోటీ చేశాయి. ఈసారి జేఎంఎం తమ సీట్ల సంఖ్యను పెంచే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.



## ప్రొటెం స్పీకర్‌గా ముబారక్ ప్రమాణస్వీకారం

**జనపదం, న్యూఢిల్లీ :** కేంద్రపాలిత ప్రాంతం జమ్ముకశ్మీర్‌లో సుదీర్ఘకాలం తర్వాత అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. అక్కడ చివరగా బీజేపీ–పీడీపీ సంకీర్ణ సర్కారు కుప్పకూలడం, జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370ని కేంద్ర ప్రభుత్వం రద్దుచేసి జమ్ముకశ్మీర్, లడఖ్ అనే రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించడం, కేంద్రం తీరును నిరసిస్తూ ఆందోళనలు వెల్లువెత్తడం లాంటి పరిణామాల నేపథ్యంలో 2018 నుంచి రాష్ట్రపతి పాలన కొనసాగింది. ప్రస్తుతం పరిస్థితి చక్కబడటంతో ఇటీవల అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించారు. మొత్తం 90 స్థానాలకు నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ 42 స్థానాలను గెలుచుకుంది. కాంగ్రెస్, ఆప్ మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఒమర్ అబ్దుల్లా ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి, బాధ్యతలు స్వీకరించారు. ఆయనతో పాటు కొందరు మంత్రులుగా బాధ్యతలు తీసుకున్నారు. త్వరలో అసెంబ్లీ కొలువుదీరనుంది. ఈ నేపథ్యంలో శనివారం ప్రొటెం స్పీకర్ ప్రమాణస్వీకారం జరిగింది. నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ సీనియర్ నేత ముబారక్ గుల్ ప్రొటెం స్పీకర్‌గా ప్రమాణస్వీకారం చేశారు. శ్రీనగర్‌లోని రాజ్‌భవన్‌లో ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. జమ్ముకశ్మీర్ గవర్నర్ మనోజ్ సిన్హా.. ముబారక్ గుల్ చేత ప్రమాణస్వీకారం చేయించారు. కొత్తగా కొలువుదీరబోయే అసెంబ్లీలో ఎమ్మెల్యేలందరి చేత ఆయన ప్రమాణ స్వీకారాలు చేయించనున్నారు. ఆ స్పీకర్, డిప్యూటీ స్పీకర్‌ల ఎన్నిక జరగనుంది. ఇదిలావుంటే ఒమర్ అబ్దుల్లా క్యాబినెట్ ఇటీవల సమావేశమై జమ్ముకశ్మీర్‌కు రాష్ట్రహోదా కల్పించాలని తీర్మానం చేసింది.



## నెతాన్యహూ ఇంటిపై డ్రోన్ దాడి

- దాడి సమయంలో ఆయన ఇంట్లో లేరు
- ఎవరికీ ప్రమాదం లేదన్న అధికారులు

**జనపదం, న్యూఢిల్లీ :** ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమన్ నెతాన్యహూ ఇంటిపై డ్రోన్ దాడి జరిగింది. సిసేరియా పట్టణంలో ఉన్న ఆయన నివాసంపై డ్రోన్‌తో అటాక్ చేశారు. హమాస్ నేత యహ్యా సిన్వార్ హత్య తర్వాత ఈ ఘటన చోటుచేసుకున్నది. డ్రోన్ దాడి జరిగిన సమయంలో ఆ సమీపంలో నెతాన్యహూ లేరని ఆయన ప్రతినిధి తెలిపారు. నెతాన్యహూ ఇంటిపై జరిగిన దాడిలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం లేదన్నారు. లెబనాన్ నుంచి డ్రోన్‌ను లాంచ్ చేసి ఉంటారని ఇజ్రాయిల్ మిలిటరీ అంచనా వేస్తున్నది. అయితే ఓ డ్రోన్ ఓ బిల్డింగ్‌ను ఢీకొట్టిందని, ఆ తర్వాత మరో రెండు డ్రోన్లను ఇజ్రాయిల్ భూభాగంలోకి పంపినట్లు తెలిపారు. డ్రోన్ దాడి తామే చేసినట్లు ఇంకా హిజ్‌బొల్లా ప్రకటించలేదు.

# ముత్యాలమ్మ ఆలయం వద్ద ఉద్రిక్తత

- నిరసనకారులపై పోలీసుల లాఠీఛార్జ్
- సికింద్రాబాద్‌లో ఇంటర్నెట్ నిలిపివేత
- దాడిని ఖండించిన ఎమ్మెల్యే రాజాసింగ్



**జనపదం, సికింద్రాబాద్ :** సికింద్రాబాద్‌లో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ముత్యాలమ్మ ఆలయంలో విగ్రహ ధ్వంసంపై వీహెచ్‌పీ, హిందూ సంఘాలు, బీజేపీ కార్యకర్తల ర్యాలీలో ఘర్షణ తలెత్తింది. నిరసనకారులు, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ర్యాలీని అడ్డుకునేందుకు యత్నించిన పోలీసులపైకి నిరసనకారులు కుర్చీలు, చెప్పులు, వాటర్ ప్యాకెట్లు విసిరారు. మహంకాళి ఆలయం వద్ద రోడ్డుపై బైఠాయించిన ఆందోళనకారులకు డీసీపీ రష్మీ పెరుమాళ్ నచ్చచెప్పినా ఫలితం లేకుండా పోయింది. ఈ క్రమంలో పోలీసులు వారిపై లాఠీఛార్జ్ చేశారు. దీంతో ఆందోళనకారుల్లో కొందరి తలలకు, ఇతర శరీర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. లాఠీఛార్జిలో ఎడమ చెయ్యి విరిగిందంటూ ఓ యువకుడు నేలపై కూలబడ్డాడు. మరోవైపు, మత ఘర్షణలు తలెత్తకుండా సికింద్రాబాద్‌లో ముందు జాగ్రత్త చర్యగా ఇంటర్నెట్ నిలిపేసినట్లు తెలుస్తోంది. కాగా, ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహం ధ్వంసం చేసిన ఘటనకు నిరసనగా సికింద్రాబాద్‌లో శనివారం బంద్‌కు పిలుపునిచ్చారు. వ్యాపారులు, స్థానికులు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. హిందూ సంఘాలు, స్థానికులు మహంకాళి ఆలయం నుంచి ముత్యాలమ్మ ఆలయం వరకూ ర్యాలీ చేపట్టేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో అలర్ట్ అయిన పోలీసులు ఎలాంటి ఉద్రిక్తతలు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. సికింద్రాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో భారీగా పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. మహంకాళి ఆలయం వద్ద రోడ్డుపై బైఠాయించడం, అనంతరం ర్యాలీతో ఉద్రిక్తత పెరిగే క్రమంలో పోలీసులు వారిని అడ్డుకున్నారు. పోలీసులు నచ్చజెప్పినా వినకపోవడంతో వాగ్వాదం జరిగి లాఠీచార్జికు దారితీసింది.

### అసలేం జరిగిందంటే...?

ఈ నెల 14న అర్ధరాత్రి సమయంలో సికింద్రాబాద్ మోండా మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. అమ్మవారి ఆలయంలోకి చొరబడి మరీ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. ఈ తతంగమంతా అక్కడి సీసీ ఫుటేజీలో నమోదైంది. ఈ ఘటనపై స్థానికులు, హిందువులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసి హిందువుల మనోభావాలు దెబ్బతీశారంటూ మండిపడ్డారు. ఆనాడు పెద్ద ఎత్తున అమ్మవారి ఆలయం వద్ద రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. దీంతో ఉద్రిక్తత నెలకొంది. ఈ క్రమంలో భారీగా మోహరించిన పోలీసులు ఆందోళనకారులకు సద్దిచెప్పేందుకు యత్నించారు. పోలీసులు, నిరసనకారులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఘటన జరిగిన వెంటనే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆలయం వద్దకు చేరుకుని సీపీ సీవీ ఆనంద్‌తో కలిసి పరిశీలించారు. అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. దీనిపై ఫిర్యాదు అందుకుని విచారించిన పోలీసులు ఒకరిని అదుపులోకి తీసుకున్నారు.

### లాఠీఛార్జిపై ఎమ్మెల్యే రాజాసింగ్ ఆగ్రహం..



ముత్యాలమ్మ ఆలయం వద్ద హిందూ సంఘాలపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడాన్ని బీజేపీ ఎమ్మెల్యే రా జాసింగ్ ఖండించారు. మతపరమైన మనోభావాలపై దాడి జరిగినప్పుడు, విగ్రహాలను అపవిత్ర చేసినప్పుడు శాంతియుతంగా నిరసన చేయడానికి కూడా అనుమతించకపోవడం తీవ్ర కలకలం రేపుతోందన్నారు. 'ఈ లాఠీఛార్జికు ఎవరు ఆదేశించారు.? ఆలయాన్ని అపవిత్రం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి తప్ప న్యాయం కోరే భక్తులపై కాదు. మా విశ్వాసంపై జరిగిన దాడికి మేము జవాబుదారీతనం, న్యాయాన్ని కోరుతున్నాం.' అని రాజాసింగ్ పేర్కొన్నారు.



## భక్తులపై లాఠీ చార్జి అనాలోచితం ..

**జనపదం, సికింద్రాబాద్ :** సికింద్రాబాద్ కుమ్మరిగూడ ముత్యాలమ్మ దేవాలయం వద్ద భక్తులపై పోలీసుల లాఠీఛార్జిని తీవ్రంగా ఖండిస్తున్నామని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్ అన్నారు. భక్తుల రక్తం కళ్ళ చూసిన పాపం ఊరికే పోదని, అమ్మవారిని కాళ్ళతో తన్ని అవమానించిన వ్యక్తి వెనుక ఉన్నది ఎవరో ఇప్పటివరకు ప్రకటించని ప్రభుత్వం, హిందువుల తలలు పగిలేలా దాడి చేయించడం అన్యాయమన్నారు. వివిధ రాష్ట్రాల నుం డి రెండు వందలమంది సికింద్రాబాద్ మెట్రోపోలీస్ హోటల్ లో మత విద్వేషాలు రెచ్చగొట్టే సమావేశం పెట్టుకున్నారని తెలిసినా ఎందుకు ఉదారంగా వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. లుంబినిపార్క్, గోకుల్ చాట్, దిలుషుక్ నగర్ బాంబు పేలుళ్లలో తెగిపడ్డ మాంసపు ముద్దలు గుర్తుకు వస్తున్నాయని, మీ చిల్లర రాజకీ యాల కోసం తాత్సారం చేస్తే బల య్యేది అమాయక ప్రజలు, మూల్యం చెల్లించాల్సింది మీ ప్రభుత్వమే అని ఈటల హెచ్చరించారు. ఒక్క పిలుపు ఇస్తే ఇంతమంది భక్తులు వచ్చారంటేనే హిందువులు ఎంత రగిలిపోతున్నారో ఎంత అభద్రతతో ఉన్నారో ర్యా లీ ఒక ఉదాహరణ అన్నారు. ఇకనైనా ప్రభుత్వం వెంటనే స్పందించి విద్వేషాలు రెచ్చగొట్టేందుకు వచ్చిన ముఠా వివరాలు బయటపెట్టి, కఠిన చర్యలు తీసుకోవాలని, అప్పుడే స్థానిక ప్రజల ఆగ్రహావేశాలు చల్లారుతాయని ఈటల అన్నారు.

# కట్టెపెట్టినా ఆగేదుండదు..

- ఇందిరమ్మ ఇళ్లకు వేళయ్యింది..
- ఈనెల చివరి నాటికి నియోజకవర్గానికి 4 వేల ఇండ్లు..
- నాలుగేళ్లలో 20 లక్షల నిర్మాణాలే లక్ష్యం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- గోషామహల్ నియోజకవర్గ లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీ

**ప్రజాపదం, హైదరాబాద్ సిటీ :** ఈ నెల చివరి నాటికి రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి తొలివిడతగా 4 వేల ఇళ్లను మంజూరు చేయబోతున్నామని రెవెన్యూ,హౌసింగ్,సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. వచ్చే నాలుగేళ్లలో రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వడమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమన్న మంత్రి 20 లక్షల ఇళ్లకు తగ్గకుండా నిర్మిస్తామని తెలిపారు. కులాలు, మతాలు, ప్రాంతాలు, పార్టీలు, ఎలాంటి తేడా లేకుండాఅర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడమే ప్రభుత్వ ఆశయమన్నారు. శనివారం గోషామహల్ నియోజకవర్గానికి చెందిన 144 మంది లబ్ధిదారులకు హైదరాబాద్ కలెక్టర్ కార్యాలయంలో జిల్లా ఇన్ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పట్టాలు అందజేశారు. ఈ సందర్భం గా మంత్రి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఎలాంటి భేషజాలకు పోకుండా కేంద్రం నుంచి రాష్ట్రానికి రావలసిన వాటా, నిధులు అడిగి తీసుకుంటామన్నారు. ఈ మేరకు పెద్ద ఎత్తున రాష్ట్రానికి ఇండ్లను మంజూరు చేయాలని ఈ నెల 18న హైదరాబాద్‌కు వచ్చిన కేంద్ర హౌసింగ్ జాయింట్ సెక్రటరీని కోరామన్నారు. ఎన్ని ఇబ్బందుల ఎదురైనా ప్రతిపక్షాలు కాళ్లల్లో కట్టెలు పెడుతూ అభివృద్ధి సం క్షేమాన్ని అడ్డుకోవాలని ప్రయత్నించినా ఏదీ ఆగదని ప్రకటించారు. బీఆర్ఎస్ కాకి గోలతో తమ ప్రభుత్వానికి వచ్చే నష్టమేమీ లేదనీ ఏ దాది కూడా పూర్తి కాకముందే రోడ్డు ఎక్కితే ఆ పార్టీకే తీవ్ర నష్టమన్నారు. పదేళ్ల పాలలో బీఆర్ఎస్ చేయలేనిది, తమ ప్రభుత్వం చేసి చూపిస్తుంటే వాళ్లు జీర్ణించుకోలేక పోతున్నారని వి మర్శించారు. మూసీ పరివా హక ప్రాంత ప్రజలకు మంచి జీవితాన్ని ఇవ్వాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం వారికి ఇండ్లు, ఉద్యోగం, ఉపాధి, కల్పిస్తే బీ ఆర్ఎస్ ఓర్చుకోలేక పోతోందన్నారు. మూసీ సుందరీకరణ కాదు, మూసీ పరివాహక ప్రాంతాల ప్రజల జీవనోపాధి కోసం వారి జీవితాలను మెరుగు ప రచడానికి తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. మూసీ పరివాహక ప్రాంతాల ప్రజలు తమ జీవిత కాలం అదే మురికికుప్పలో బ్రతకాలని బీఆర్ఎస్ కోరుకుంటుందా అని మంత్రి ప్రశ్నించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఏ కార్యక్రమం చేసిన ఇబ్బంది పెట్టే కుట్ర జరుగుతుందన్నారు. మూసీ పునర్జీవనం పై అనేక అభాం డాలు వేస్తున్నారనీ అక్కడున్న పేదవారిని అక్కడే వదిలేస్తారా అని ప్రశ్నించారు. మూసీ రివర్ ఫ్రంట్ ఏర్పాటు చేసింది మీరు కాదా అని నిలదీశారు. తెలంగాణ ఏర్పడినప్పుడు ఖజా నాలో పై సలతో ఇచ్చాం కానీ గత ప్రభుత్వం రూ.7 లక్షల కోట్ల అప్పు చేసి రూ.40 వేల కోట్ల బిల్లులు పెండింగ్ బకాయిలు పెట్టిందన్నారు. బాధ్యత గల ప్రతిపక్షం అయితే నిర్మాణాత్మక సలహా లు ఇవ్వాలని బీఆర్ ఎస్ నేతలను కో రారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రాజా సింగ్, గణే ష్ ఎమ్మెల్సీలు బలమూరి వెంకట్, రహ మత్ బేగ్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు.



# సవాల్ పై నిలబడతారా..?

- మూసీ ప్రాంతంలో నివాసం ఉంటా...
- సీఎం సవాల్ కు కిషన్ రెడ్డి ప్రతిసవాల్....
- పేదల ఇళ్లు కూల్చితే ఊరు కోమని హెచ్చరిక..
- పేదలకు అక్కర్లేని పనులతో ఒరిగేదేమి ఉండదని హితవు..



**జనపదం, హైదరాబాద్ సిటీ :** మూసీ నది సుందరీకరణపై సీఎం రేవంత్ రెడ్డి విసిరిన సవాల్ కు తాను సిద్ధమని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రకటించారు. మూసీ ప్రక్షాళన వ్యతిరేకించే బీఆర్ఎస్, బీజేపీ నేతలు మూడు నెలల పాటు ఆ ప్రాంతంలో నివాసముంటే సుందరీకరణ అంశాన్ని పక్కనపెడతానని సీఎం రేవంత్ సవాల్ విసిరారు. ఆ మేరకు రేవంత్ రెడ్డి సవాల్ ను తాను స్వీకరిస్తున్నట్లు కేంద్ర కిషన్ రెడ్డి ప్రకటించారు. మూడు నెలల పాటు మూసీ ప్రాంతంలో నివాసముండేందుకు తాను సిద్ధమని, మరి సీఎం రేవంత్ రెడ్డి సిద్ధంగా ఉన్నారా అని ఆయన ప్రశ్నించారు. శనివారం మూసీ పరివాహక ప్రాంతాలైన లంగర్ హౌస్ బాపు నగర్, రాందేవ్ గూడ, కేసరినగర్ లలో కిషన్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా నిర్వాసితులతో ఆయన మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో కిషన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో అనేక ఏళ్ళుగా మూసీ పరివాహక ప్రాంతంలో నివాసముంటున్న పేదలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని మండిపడ్డారు. సుందరీకరణ పేరుతో ప్రభుత్వం పేదల ఇండ్లకు మార్కింగ్ చేయడం సరైన ద్ధతి కాదన్నారు. మూసీ సుందరీకరణ కోసం లక్షాయాభై వేల కోట్లను ఖర్చు చేస్తామని రేవంత్ సర్కార్ అంటోందని, అయితే ముందుగా మూసీకి ఇరువైపులా రక్షణగోడను నిర్మించాలని డిమాండ్ చేశారు. మూసీనది జలాల శుద్ధిని బీజేపీ వ్యతిరేకించదని, అయితే పేదల ఇళ్ళను కూలగొడితే చూస్తూ ఊరుకోబోమని ఆయన హెచ్చరించారు.

### ముందు డ్రైనేజీ సంగతి చూడండి..

నగరంలోని డ్రైనేజీ వాటర్ మూసీలోనే కలుస్తోందని, ఈ క్రమంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చకుండా మూసీ సుందరీకరణ సాధ్యం కాదన్నారు. మూసీ ప్రక్షాళన వ్యవహారానికి సంబంధించి బీఆర్ఎస్ నేత కేటీఆర్ తో నీతులు చెప్పించుకునే స్థితిలో బీజేపీ లేదన్నారు. అసలు మూసీ గురించి మాట్లాడే అర్హత కేటీఆర్, బీఆర్ఎస్ నేతలకు లేదని కిషన్ రెడ్డి అన్నారు. మూసీ నది సుందరీకరణకు తెరలేపిందే బీఆర్ఎస్ ప్రభుత్వమని అన్నారు. అప్పట్లో ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో బీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలు తోకముడిచారని కిషన్ రెడ్డి ఆరోపించారు. ప్రజలు కోరుకోనప్పుడు మూసీ సుందరీకరణ ఎందుకని, ని ర్వాసితులకు అండగా బీజేపీ ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

# రైతు భరోసా గోవిందా...

- ఇప్పటికైతే మంగళమే.. రబీకి చూద్దాం..
- సబ్ కమిటీ నివేదిక వచ్చాకే యథావిధిగా...
- తేల్చిచెప్పిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల
- నెలాఖరులోగా రూ.2 లక్షలలోపు రుణాల మాఫీ చేస్తామని వివరణ...



**జనపదం, హైదరాబాద్ బ్యూరో :** కేబినెట్ సబ్ కమిటీ రిపోర్టు వచ్చాకే రైతు భరోసా పథకం అమలు చేస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ప్రస్తుత వానాకాలం సీజన్ కు పంట పెట్టుబడి సాయం ఉండదన్న ఆయన వచ్చే రబీ సీజన్ నుంచి కచ్చితంగా అందిస్తామని తెలిపారు. అర్హత ఉన్న రైతుకు ప్రతి ఎకరానికి రూ.7500 చెల్లిస్తామని పేర్కొన్నారు. శనివారం నల్గొండలో మీడియాతో మాట్లాడిన ఆయన రైతు భరోసా స్కీమ్ పై మంత్రి ఉపసంఘం ఏర్పాటు చేశామనీ కమిటీ నివేదిక వచ్చిన తర్వాతే పథకాన్ని అమలు చేస్తామన్నారు.

ఈ నెలాఖరులోగా రూ.2 లక్షలలోపు రుణాలు ఉన్నఅర్హులైన వారందరికీ రుణమాఫీ పూర్తి చేస్తామని ప్రకటించారు. నవంబర్ 1 నుంచి రూ.2 లక్షల కంటే ఎక్కువ రుణాలున్న రైతుల రుణమాఫీపై ప్రక్రియ చేపడతామన్నారు. దీంతో రూ.2 లక్షల కంటే ఎక్కువ రుణాలు ఉన్న రైతులు... ముందుగా పైన ఉన్న రుణాన్ని అక్టోబర్ 31లోపు క్లియర్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం మొదటి పంట కాలంలోనే రూ.31 వేల కోట్ల రైతుల పంట రుణాలు మాఫీ చేస్తామన్న మంత్రి ఇప్పటి వరకూ 22 లక్షల రేషన్ కార్డులు కలిగిన రైతులకు రూ.18 వేల కోట్ల రుణమాఫీ నగదు ఖాతాల్లో జమ చేశామన్నారు. ఈ నెలాఖరు నాటికి రేషన్ కార్డులు మిగిలిన 4 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ పూర్తి చేస్తామన్నారు. రూ.2 లక్షల పైన రుణాల మాఫీపై షెడ్యూల్ ప్రకటిస్తామన్నారు. ఎట్టి పరిస్థితులలో ఈ పంట కాలంలోనే రూ.31 వేల కోట్లు రుణమాఫీ చేసి తీరుతామని తుమ్మల స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. పంట వేయని భూములకు రూ. 25వేల కోట్లు ఇచ్చిందని ఆరోపించిన ఆయన తాము సన్నధాన్యం పండించిన ప్రతీ రైతుకు రూ. 500 బోనస్ ఇస్తామన్నారు. ఆర్థిక వెసులుబాటు లేకపోయినా సీఎం రుణమాఫీ అంశాన్ని తన భుజాన వేసుకున్నారన్నారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం 42 బ్యాంకుల నుంచి వివరాలు తెప్పించుకొని రుణమాఫీ చేశామన్నారు. 20లక్షల మందికి ఇంకా రుణమాఫీ చేయాల్సి ఉందనీ రూ. 2లక్షలపైన ఉన్న డబ్బులు కడితే రుణమాఫీ అవుతుందని రైతులకు సూచించారు. తెల్ల రేషన్ కార్డు లేని మూడు లక్షల మందికి డిసెంబర్ లో కుటుంబ నిర్ధారణ చేసి వారికి కూడా రుణమాఫీ చేస్తామని తుమ్మల చెప్పారు.

## మహిళా కమిషన్ కొత్త చైర్‌పర్సన్‌గా విజయా రహాట్కర్



**జనపదం, న్యూఢిల్లీ :** జాతీయ మహిళా కమిషన్ కొత్త చైర్‌పర్సన్‌గా విజయ కిషోర్ రహాట్కార్ ను కేంద్ర ప్రభుత్వం శనివారం నియమించింది. నేషనల్ కమిషన్ ఫర్ ఉమన్ యాక్ట్– 1990లోని సెక్షన్ 3 కింద ఈ నియామకం జరిపినట్లు నోటిఫికేషన్‌లో కేంద్రం తెలిపింది. ఎన్‌సీడబ్ల్యూ చైర్‌పర్సన్‌గా మూడేళ్లు పాటు ఆమె ఈ పదవిలో ఉంటారు. రహట్కార్‌తో పాటు ఎన్‌సీడబ్ల్యూ సభ్యురాలిగా డాక్టర్ అర్చన మజుందార్‌ను కూడా కేంద్రం నియమించింది. మజుం దార్ నియామకం కూడా మూడేళ్ల పాటు కొనసాగుతుంది. ఎన్‌సీడబ్ల్యూ 9వ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న విజయా రహట్కర్ దీనికి ముందు మహారాష్ట్ర స్టేట్ కమిషన్ ఫర్ ఉమన్ చైర్‌పర్సన్‌గా 2016– 2021 వరకూ సేవలందించారు. పోక్సో, యాంటీ ట్రిపుల్ తలాక్ చర్యలు, యాంటీ ఉమన్ ట్రాఫికింగ్ యూనిట్ల వంటి అంశాలపై చట్టపరమైన సంస్కరణలపై కీలకంగా దృష్టి సారించారు. డిజిటల్ లిటరసీ కార్యక్రమాలను ప్రమోట్ చేశారు. వీటికి తోడు నాయకత్వ ప్రతిభను కూడా ఆయన చాటుకున్నారు. నేషనల్ యూత్ ఆర్గనైజేషన్ ఉపాధ్యక్షురాలిగా, మహిళ విభాగం అధ్యక్షురాలిగా ఏడళ్లు పనిచేశారు. ప్రస్తుతం నేషనల్ సెక్రటరీగా ఉన్నారు. మహిళా లీగల్ అంశాలపై 'విధిలిఖిత్' అనే పుస్తకంతో సహా పలు పలు పుస్తకాలను రచించారు. పుణె యూనివర్శిటీలో ఫిజిక్స్‌లో బ్యాచిలర్ డిగ్రీ, హిస్టరీలో మాస్టర్ డిగ్రీ పొందారు.

## కాంగ్రెస్ తో దోస్తీ చేసేది కేసీఆరే..

- చీకట్లో ఢిల్లీ పెద్దలను కలిసి డబ్బు సంచులు అప్పగించింది మీ అయ్యకాదా..
- ఇతర రాష్ట్రాల ఎన్నికలకు డబ్బు మూటలు పంపింది కేసీఆరే
- మీకు దోస్తీ లేకుంటే ఆ కేసులు సీబీఐకి అప్పగించమనండి
- మాకు రేవంత్ తో దోస్తీ అవసరమేంది..?
- కేటీఆర్ ట్వీట్ పై నిప్పులు చెరిగిన బండి సంజయ్



**జనపదం, హైదరాబాద్ బ్యూరో :** కాంగ్రెస్ తో దోస్తీ చేసేది మీ అయ్యే అంటూ మాజీ మంత్రి కేటీఆర్ పై కేంద్రమంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. "నాకు రేవంత్ రెడ్డితో దోస్తానా ఉంటే మీ ప్రభుత్వం పడిపోయే ప్రమాదముందని మీడియా ముందు మాట్లాడతమా? నేనే కాదు... ఎవరితోనైనా దోస్తానా? ఉంటే ఫోన్ లో మాట్లాడుకుంటారే తప్ప మీడియాతో మాట్లాడరు కదా... అంతెందుకు మీ అయ్యకు కాంగ్రెస్ పెద్దలతో దోస్తానా ఉంది కాబట్టే ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం కేసుల్లో అరెస్ట్ కాకుండా తప్పించుకునేందుకే చీకట్లో ఢిల్లీకి పోయి కాంగ్రెస్ పెద్దలతో మాట్లాడుకుని డబ్బు సంచులు ఇచ్చి వచ్చింది వాస్తవం కాదా? ఆ కేసులు విచారణకు రాకుండా ఢిల్లీ పెద్దల మందు సాగిలపడ్డది నిజం కాదా?'' అంటూ కేటీఆర్ మీద బండి సంజయ్ నిప్పులు చెరిగారు. సీఎం రేవంత్ ను కాపాడేందుకు బండి సంజయ్ తాపత్రయపడుతున్నారంటూ కేటీఆర్ చేసిన ట్వీట్ కు ఘాటుగా బదులిచ్చారు. ఈ విషయంపై శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో తనను కలిసి మీడియా ప్రతినిధుల అడిగిన ప్రశ్నలకు బండి సంజయ్ సమాధానమిస్తూ.. బీఆర్ఎస్ పదేళ్లు అధికారంలో ఉంది కదా.... రేవంత్ రెడ్డిపై ఓటుకు నోటు కేసు ఉన్నది కదా? ఎందుకు తేల్చలేకపోయారు? ఎందుకు ఆ కేసును నీరుగార్చారు? రేవంత్ తో దోస్తానా ఉన్నది మీకా? మాకా? అని కేటీఆర్ ను ప్రశ్నించారు. రేవంత్ తో దోస్తీ తమకేమి అవసరమని అన్నారు. కేటీఆర్ అహంకారంవల్లే బీఆర్ఎస్ పార్టీకి ఈరోజు ఈ గతి పట్టిందని, అయినా కేటీఆర్ కు అహంకారం తగ్గలేదని ఆయన విమర్శించారు. ప్రస్తుతం బీఆర్ఎస్ గ్రాఫ్ పెరిగే పరిస్థితి కూడా లేదన్నారు. కేటీఆర్ బాధ భరించలేకే వాళ్ల అయ్య కేసీఆర్ ఫాం హౌజ్ కే పరిమితమై పండుకున్నారని బండి సంజయ్ ఎద్దేవా చేశారు. . కేటీఆర్ వల్ల బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా సర్వనాశనమవడం ఖాయమని జోస్యం చెప్పారు. ప్రతిరోజూ ఏదో ఒక పేపర్ చూసి మొరుగుడు కాదు... నిరుద్యోగులను లాఠీఛార్జ్ చేయించింది మీ అయ్యే కదా అని కేటీఆర్ ను ప్రశ్నించారు. రైతులు,

# రిజర్వేషన్లను రద్దు చేసే కుట్ర



- సోనియా జన్మదినం - నిరుద్యోగుల బలిదినం కాబోతుంది
- గ్రూప్ -1 పరీక్షలను రీషెడ్యూల్ చేయాల్సిందే
- కేంద్రమంత్రి బండి సంజయ్

**జనపదం, హైదరాబాద్ సిటీ:** రాష్ట్రంలో రిజర్వేషన్లను ఎత్తివేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. అందులో భాగంగానే గ్రూప్ 1 పరీక్షల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను వర్తింపజేయకుండా జీవో నెంబర్ 29 జారీ చేసిందన్నారు. డిసెంబర్ 9న సోనియాగాంధీ జన్మదినం నిరుద్యోగుల పాలిట బలిదినం కాబోతోందన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా, రిజర్వేషన్లపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. దీంతోపాటు 29 జీవోను ఎత్తివేసి, గ్రూప్ 1 పరీక్షలను రీ షెడ్యూల్ చేయాలని స్పష్టం చేశారు. నిరుద్యోగుల ఆందోళనను ప్రభుత్వానికి తెలియజేసేందుకే తాము ర్యాలీ నిర్వహించినట్లు చెప్పారు. ఈ మేరకు శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో బీజేపీ లీగల్ సెల్ రాష్ట్ర నాయకులు ఆంటోనిరెడ్డి, అధికార ప్రతినిధి జె.సంగప్ప, యువమోర్చా రాష్ట్ర అధ్యక్షులు మహేందర్, రాష్ట్ర నాయకులు డాక్టర్ పుల్లారావులతో కలిసి మంత్రి బండి సంజయ్ మాట్లాడారు.. బీజేపీపట్ల నిరుద్యోగులు చూపుతున్న స్పందనను చూసి ఓర్వలేక... బీఆర్ఎస్ నేతలు తమ ర్యాలీలో చొరబడి విధ్వంసం చేసేందుకు కుట్ర చేశారని మండిపడ్డారు. నిరుద్యోగుల పక్షాన తాను పోరాడుతుంటే, కేటీఆర్ పిచ్చికుక్కలా మొరుగుతున్నాడని నిప్పులు చెరిగారు. 'కేటీఆర్.. నువ్వో యూజ్ లెస్ ఫెలో, నేను పోరాడుతుంటే నాపై వ్యక్తిగత దూషణలు చేస్తావా? నీ డ్రగ్స్, చీకటి లీలలు తెలియదుకుంటున్నవా? కాంగ్రెస్ తో మీ కుమ్మక్కు రాజకీయాలు తెలియదనుకుంటున్నవా? నా జోలికొస్తే నీ బండారమంతా బయటపెడతా..."అంటూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "నేను హిందీ పేపర్ లీక్ చేసినట్లు, నువ్వు డ్రగ్స్ తీసుకోలేదని దేవుడి ముందు నీ ఫ్యామిలీతో కలిసి ప్రమాణం చేసే దమ్ముందా నీకు... నువ్వు ఆ పనిచేస్తే నేను క్షమాపణ చెప్పేందుకు సిద్ధం."అని సవాల్ విసిరారు.



## రేవంత్ తీరుతో రాజ్యాంగ స్ఫూర్తికి తూట్లు..

**(మొదటిపేజీ తరువాయి)** కానీ టీపీపీ ఎస్సీలో ఎందుకు అమలు కావడం లేదన్నారు. ఓపెన్ లో బలహీన వర్గాలకు ప్రవేశం లేకుండా చేస్తున్నదని, హక్కులు కాపాడాలని పిల్లలు రోడ్ల మీదకు వస్తే ఉక్కుపాదం తో అణచి వేస్తున్నారని మండిపడ్డారు.

**అశోక్ నగర్ అల్లాడుతోంది..**

విద్యార్థుల ఆర్తనాదాలతో అశోక్ నగర్ అల్లడుతోందన్నారు. టెర్రరిస్టుల తో, సంఘ విద్రోహ శక్తులతో వ్యవహరించినట్లు వ్యవహరిస్తున్నారని రేవంత్ రెడ్డి ఎందుకు అంత కఠినంగా, కర్కశంగా విద్యార్థులతో ప్రవర్తిస్తున్నారన్నారు. రాహుల్ గాంధీ ఎందుకు పట్టించుకోరని ఎన్నికలప్పుడు అశోక్ నగర్ కి వెళ్లి ఓట్లు అడిగిన రేవంత్ రెడ్డి ఇప్పుడు ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నించారు. కోదండరాం కు ఎమ్మెల్సీ పదవి రాగానే గొంతు మూగపోయింది అన్నారు. రియజ్, ఆకునూరి మురలీ, నవీన్ లాంటి వాళ్ళు ఉద్యోగాలు పొందారు.. తప్ప విద్యార్థులకు దగా మిగిలిందన్నారు. పదవులు పొందిన వారంతా అశోక్ నగర్ కు రావాలి. ఈ వానాకాలం రైతులకు బంధు ఇవ్వనన్నందుకు రేవంత్ రెడ్డి చెంపలేసుకుని రైతులకు క్షమాపలు చెప్పాలన్నారు. లక్షా 50 వేల కోట్లతో మూసీ సుందరీ కరణ అని చెప్పే రేవంత్ కు రైతుల కు 15 వేలు ఇవ్వడానికి చేతులు రావడం లేదన్నారు. ఎట్టి పరిస్థితుల్లో రైతులకు వానాకాలం రైతు బంధు ఇవ్వాల్సిందేనని, అలాగే నిరుద్యోగులకు అన్యాయం చేస్తే పోరాటానికి వెనకాడమన్నారు.

## లాఠీల రాజ్యం..

**(మొదటిపేజీ తరువాయి)** పాలకులు దానిపై ప్రశ్నించడాన్నే తప్పుగా, రాజ్యాంగ విరుద్ధమైన చర్యగా భావిస్తూ తీవ్ర అన్యాయం చేయడం మరీ దారుణమని బాధితులు ఆవేదన వెలిబుచ్చుతున్నారు. బాధలు తీర్చాల్సిన పెద్దలే తమకు అతి బాధాకరమైన పరిస్థితిని కల్పిస్తే తామెవరికి చెప్పుకునేదని దు:ఖిస్తున్నారు. రాష్ట్రం ఇంత అధ్వానమైన పరిస్థితికి వెళ్లడానికి ఇంత తక్కువ సమయం పడుతుందని అనుకోలేదని ప్రధాన ప్రతిపక్షం విమర్శిస్తుండగా, మేధావి వర్గం కూడా ఇలాంటి చర్యలు అతి దరిద్రానికి నిదర్శమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలోని ఈ అనిశ్చితి వాతావరణాన్ని ఛేధించి సర్కార్ దిద్దుబాటు చర్యలకు ఆలస్యం చేయొద్దని అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.



# తెగని లొల్లి...

- గ్రూప్ -1 అభ్యర్థుల ఉద్యమబాట
- సచివాలయం ముట్టడి
- పోలీసుల లాఠీచార్జ్
- మద్దతుగా వెళ్ళిన కేంద్రమంత్రి బండి సంజయ్
- అరెస్టు చేసిన పోలీసులు
- సచివాలయం ర్యాలీలో తీవ్ర ఉద్రిక్తత

**జనపదం, బ్యూరో:** రాష్ట్రంలో గ్రూప్ – 1 వివాదం ఆగడం లేదు. గ్రూప్ – 1 అభ్యర్థులు ఆందోళన బాట పట్టడంతో వివాదం తెగని లొల్లిగా మారింది. ఎస్సీ, ఎస్టీ , బీసీల రిజర్వేషన్లకు అడ్డంకిగా ఉన్న జీవో నెంబర్ 29ను ఎత్తివేయాలని మూడు రోజులుగా అభ్యర్థులు చేస్తున్న అందోళన కాస్తా రాష్ట్ర రాజకీయాల్లో సంచలనానికి తెరలేపింది. మెయిన్స్ పరీక్షలను వాయిదా వేయాలని, జీవో నెంబర్ 29ని రద్దు చేయాలని కోరుతూ అభ్యర్థులు చేపట్టిన ఆందోళన ఉద్రిక్తత నెలకొంది. శనివారం హైదరాబాద్ లోని అశోక్ నగర్ చౌరస్తాలో అందోళనకు దిగిన అభ్యర్థులతో మాట్లాడేందుకు కేంద్రమంత్రి బండి సంజయ్ వెళ్ళారు. గ్రూప్ –1 అభ్యర్థుల ఆందోళనకు మద్దతు ఇచ్చారు. నిరుద్యోగులతో కలిసి రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా "సీఎం డౌన్ డౌన్... 29 జీవోను రద్దు చేయాలి. గ్రూప్ 1 పరీక్షలను రీషెడ్యూల్ చేయాలి" అంటూ నినాదాలు చేశారు. అశోక్ నగర్ చౌరస్తా చుట్టూ పోలీసులు భారీగా మోహరించినప్పటికీ వేలాదిగా నిరుద్యోగులు బండి సంజయ్ వద్దకు చేరుకుని తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్ళారు. పోలీసులు తమపై అన్యాయంగా లాఠీలు ఝుళిపించి గంటల తరబడి నిర్బంధించారని వాపోయారు. జీవో నెం.29 రద్దు చేసేవరకు తమకు అండగా నిలవాలని బండి సంజయ్ ను కోరారు. నిరుద్యోగుల విషయంలో నాటి బీఆర్ఎస్, నేటి కాంగ్రెస్ పాలకులు చేసిన అన్యాయాన్ని ఏకరవు పెడుతూ వినతి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ గ్రూప్ – 1 అభ్యర్థులకు న్యాయం జరిగేంత వరకు బీజేపీ పోరాటం చేస్తోందని హామీ ఇచ్చారు. తాను కేంద్రమంత్రినైనా, మీ కోసమే రోడెక్కుతున్నానని తెలిపారు. మీరంతా ప్రశాంతంగా చదువుకోండని భరోసా ఇచ్చారు. జీతాలిచ్చే పరిస్థితి కూడా రాష్ట్ర ప్రభుత్వానికి లేదన్నారు. అందుకే కావాలనే ఏదో ఒక లిటిగేషన్ పెట్టి గ్రూప్ 1 పరీక్షలు లొల్లి చేస్తుందని ఆరోపించారు. అందులో భాగంగానే రూల్ ఆఫ్ రిజర్వేషన్ కు వ్యతిరేకంగా 29 జీవోను జారీ చేసిందన్నారు. ఈ నేపథ్యంలో పోలీసు ఉన్నతాధికారులు కేంద్ర మంత్రి బండి సంజయ్ వద్దకు వచ్చి అక్కడి నుండి వెళ్లిపోవాలని అభ్యర్థించారు. గ్రూప్ 1 అభ్యర్థులకు న్యాయం చేసేంతవరకు ఇక్కడి నుండి కదిలేది లేదని ససేమిరా అని సంజయ్ రోడ్డుపైనే బైఠాయించారు.

**బండి సంజయ్ ఛలో సెక్రటేరియేట్ ర్యాలీ**

ఉద్రిక్త పరిస్థితుల నడుమ ఆందోళనకారులతో కలిసి బండి సంజయ్ ఛలో సెక్రటేరియేట్ పేరుతో ర్యాలీ తీశారు. సచివాలయానికి పాదయాత్రగా బయలుదేరిన బండి సంజయ్ ర్యాలీని లిబర్టీ సర్కిల్ సమీపంలో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో లోయర్ ట్యాంక్ బండ్ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ సందర్భంగా పోలీసుల తీరుపై బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలని చూడకుండా హాస్టళ్లలో చొరబడి కొట్టే అధికారం మీకెవరిచ్చారని పోలీసులపై ఆయన మండిపడ్డారు. అకారణంగా మహిళా అభ్యర్థులను బయటకు గుంజకొచ్చి గంటల తరబడి నిర్బంధించే అధికారం మీకెవరు ఇచ్చారని పోలీసులను నిలదీశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలసి వాస్తవాలను వివరించేందుకు సచివాలయానికి వెళ్తున్నామని పోలీసులకు బండి సంజయ్ స్పష్టం చేశారు. అయినప్పటికీ పోలీసులు బండి సంజయ్ ను అదుపులోకి తీసుకుని బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి తరలించారు.

**బీజేపీ, బీఆర్ఎస్ నేతల మధ్య వాగ్వాదం**

గ్రూప్ –1 అభ్యర్థులు ర్యాలీలో బీజేపీ, బీఆర్ఎస్ నేతల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఆందోళనకారులకు తెలుగుతల్లి ప్లై ఓవర్ వద్ద బీఆర్ఎస్, బీజేపీ నేతలు మద్దతు పలికారు. అయితే ఈ సమయంలో బీఆర్ఎస్, బీజేపీ నేతల మధ్య వాగ్వాదం జరిగింది. ముందుగా సచివాలయానికి ర్యాలీగా వెళ్తున్న గ్రూప్ వన్ అభ్యర్థులకు మద్దతుగా వచ్చిన బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, ప్రవీణ్‌కుమార్‌ను కొందరు గ్రూప్–1 అభ్యర్థులు అడ్డుకున్నారు. గులాబీ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. ఇదే సమయంలో అక్కడకు బీజేపీ నేతలు రావడంతో ఇరు వర్గాల మధ్య తోపులాట, వాగ్వాదం జరిగింది. ఆందోళనకారులకు మద్దతు తెలిపేందుకు వచ్చిన బీఆర్ఎస్ నాయకుల్ని అదుపులోకి తీసుకుని వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు.


**ఆందోళన చేస్తే ఊరుకోం**

**- డీజీపీ జితేందర్**

ఆందోళన చేస్తోన్న గ్రూప్ –1 అభ్యర్థులను డీజీపీ జితేందర్ హెచ్చరించారు. గ్రూప్ 1 పరీక్షల కోసం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలు జరుగుతున్నాయని తెలిపారు. రోడ్ల మీదకి వచ్చి సామాన్య ప్రజలను ఇబ్బంది పెడితే ఊరుకోమని అన్నారు. సమస్య పరిష్కారానికి సుప్రీం కోర్టు కు వెళ్ళాలి కానీ రోడ్ల మీద ఆందోళన చేస్తే ఊరుకోమంటూ ఆయన హెచ్చరించారు.

## విద్యార్థులకు కొత్త జబ్బు..

- విదేశాలకు వెళ్లాలన్న తపన ఎక్కవవుతోంది
- ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్



**జనపదం, జైపూర్ :** దేశంలోని పిల్లలను కొత్త జబ్బు పీడిస్తోందని ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ ఆవేదన వ్యక్తం చేశారు. విదేశాలకు వెళ్లాలనేదే ఆ కొత్త జబ్బు అని అన్నారు. ఈ జబ్బును "ఫోరెక్స్ డ్రెయిన్, బ్రెయిన్ డ్రెయిన్"గా ఆయన అభివర్ణించారు. విద్యను వ్యాపారం చేయడం వల్ల నాణ్యతమై ప్రతికూల ప్రభావం చూపుతుందని, ఇదెంతమాత్రం దేశ భవిష్యత్‌కు మంచిది కాదని హితవు పలికారు. రాజస్థాన్‌లోని సికార్‌లో ఒక ప్రైవేటు విద్యా సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ..."పిల్లల్లో మరో కొత్త జబ్బు కనిపిస్తోంది. పిల్లలు విదేశాలకు వెళ్లేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. కొంగ్రొత్త కలలు కంటున్నారు. కానీ ఏ సంస్థకు వెళ్తున్నాం, ఏ దేశానికి వెళ్తున్నాం అనే అంచనా వాళ్లలో ఉండటం లేదు. ఒక లెక్క ప్రకారం 2024లో 13 లక్షల మంది విద్యార్థులు విదేశాలకు వెళ్లారు. ఇక్కడే చదివి ఉంటే తమకెంత ఉజ్వల భవిష్యత్తు ఉండేదోనని ఇప్పుడు వారు అర్థం చేసుకుంటున్నారు" అని అన్నారు.

విద్యార్థుల వలసల వల్ల 6 బిలియన్ యూఎస్ డాలర్ల విదేశీ మారకద్రవ్యానికి గండిపడిందని ధన్‌ఖడ్ చెప్పారు. ఈ మేథో వలసల విషయంలో పరిశ్రమ ప్రముఖులు విద్యార్థుల్లో అవగాహన కల్పించాలని, మేథో వలసలను, కోల్పోతున్న విదేశీ మారకద్రవ్యాన్ని ఆపాలని కోరారు. ఇదే 6 బిలయన్ల డాలర్లతో మన విద్యాసంస్థల్లో ప్రాథమిక వసతుల కల్పన జరిగితే మనం ఎక్కడుంటామో ఒక్కసారి ఆలోచంచాలని అన్నారు. దీనిని తాను 'ఫోరెక్స్ డ్రయిన్, బ్రెయిన్ డ్రయిన్'గా పిలుస్తానని అన్నారు. ఇది జరక్కూడదని, విదేశాల్లో పరిస్థితులపై విద్యార్థుల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత విద్యాసంస్థలపై ఉందని చెప్పారు. విద్య వ్యాపారంగా మారితే అది జాతి భవిష్యత్తుకు మంచిది కాదన్నారు. కొన్ని కేసులో విద్య దోపిడీగా మారుతుండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. సాంకేతికతను గరిష్టంగా ఉపయోగించుకుంటూ విద్యార్థులకు నాణ్యతాయుతమైన విద్యను అందించాలని విద్యాసంస్థలకు దిశానిర్దేశం చేశారు.

## బలగాలపై మావోల దాడి..

**ఐఈడీ పేలుడులో ఇద్దరు జవాన్ల వీరమరణం**

**జనపదం, రాయ్ పూర్ :** ఛత్తీస్‌గఢ్ నారాయణపూర్ జిల్లాలోని అబుజ్‌మద్‌లోని మొహందిలో నక్సల్స్ మందుపాతరకు పాల్పడ్డారు. ఈ పేలుడులో నలుగురు ఐటీబీపీ జవాన్లు గాయపడ్డారు. ఇందులో ఇద్దరు జవాన్లు మరణించగా, మరో ఇద్దరు గాయాలపాలయ్యారు. వారికి ప్రాథమిక చికిత్స నిమిత్తం విమానంలో రాయ్‌పూర్‌కు తరలించినట్లు అధికారులు పేర్కొన్నారు. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం.. టిబెట్ బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్, బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్, డిస్ట్రిక్ట్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ ఉమ్మడి పార్టీ నారాయణపూర్ జిల్లాలోని ఓర్చా, మొండి, ఎరత్‌బట్టి ప్రాంతం నుంచి సెర్చ్ ఆపరేషన్ కోసం ధుర్బేరాకు వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో నక్సల్స్ ఐఈడీతో పేల్చారు. కోడ్లియర్ గ్రామ సమీపంలోని అడవిలో మందుపాతర పేలగా.. నలుగురు సైనికులు గాయపడ్డారు. ఇందులో ఇద్దరిని మెరుగైన చికిత్స కోసం రాయ్‌పూర్‌కు తరలించగా మృతి చెందినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. మృతులను మహారాష్ట్రలోని సతారాకు చెందిన అమర్ పన్వర్ (36), ఆంధ్రప్రదేశ్ లోని కడపకు చెందిన కే రాజేశ్ (36)గా తెలిపారు.

## రైతులను వాతావరణ మార్పులు ప్రభావితం చేస్తాయి

**సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్**



**జనపదం, న్యూఢిల్లీ :** వాతావరణ మార్పులపై భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. గోవా గవర్నర్ పీఎన్ శ్రీధరన్ పిళ్లై రచించిన 'ట్రెడిషనల్ ట్రీస్ ఆఫ్ ఇండియా' పుస్తకాన్ని సీజేఐ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ మార్పులు మత్స్యకారులు, రైతులతో పాటు సమాజంలోని అత్యంత అట్టడుగు వర్గాలను ప్రభావితం చేస్తున్నాయన్నారు. ప్రస్తుతం అక్టోబర్, డిసెంబర్‌లో వర్షాలు కురుస్తున్నాయన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు రాష్ట్రంతో పాటు పౌరులు కలిసి పని చేయాలని సీజేఐ పిలుపునిచ్చారు. నిన్న గోవాలో వర్షాలు కురిశాయని.. నారాలి పౌర్ణమి రోజున మత్స్యకారులు సముద్రానికి కొబ్బరికాయలు సమర్పిస్తే వర్షాలు ముగుస్తాయని చిన్నప్పుడు చెప్పేవారన్నారు. కానీ, అక్టోబర్, డిసెంబర్‌లో వర్షాలు కురుస్తున్నాయన్నారు. వాతావరణ మార్పులతో అన్ని వర్గాలు నష్టపోతున్నాయన్నారు. వాతావరణ మార్పు సంపన్నులను మాత్రమే ప్రభావితం చేయదని కానీ ఇది అత్యంత అట్టడుగు వర్గాలకు చెందిన మత్స్యకారులు, రైతులను కూడా ప్రభావితం చేస్తోందన్నారు.

'రాజ్యాంగంలోని ఆర్టికల్ 48 ఏ రాష్ట్రం పర్యావరణాన్ని పరిరక్షిస్తుంది, మెరుగుపరుస్తుంది. అడవులను, వన్యప్రాణులను రక్షించాలని నిర్దేశిస్తుంది. అయితే, ఆర్టికల్ 51 ఏ( జి) ప్రకృతిని రక్షించడం ప్రతి పౌరుడి ప్రాథమిక కర్తవ్యమని చెబుతుంది' అన్నారు. దేశంలోని న్యాయస్థానాలు సుస్థిర అభివృద్ధి సూత్రం, కాలుష్యదారుల చెల్లింపుల భావనతో పాటు ఇంటర్–జనరేషన్ ఈక్విటీ ఆధారంగా స్థిరమైన న్యాయశాస్త్రాన్ని కూడా అభివృద్ధి చేశాయని సీజేఐ చెప్పారు. ఇంటర్ –జనరేషన్ ఈక్విటీ అనేది అమ్మమ్మలు, తాతలు మనకు నేర్పించిన విషయాలు అన్నారు. ప్రకృతి గురించి పొందిన జ్ఞానాన్ని తరతరాలకు అందించడం, మనం గతంలోని పాఠాలను భవిష్యత్ తరాలకు అందించాలన్నారు

## అయినా ఆగవు.. మూసుకుని రాయండి..

**(మొదటిపేజీ తరువాయి)** ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రూప్––1 మెయిన్స్ పరీక్షలు ఈ నెల 21 నుంచి యథాతథంగా జరుగుతాయని స్పష్టం చేశారు. గ్రూప్ 1 పరీక్షలు కచ్చితంగా నిర్వహిస్తామని, కొంతమంది ఉద్యోగాలు పోవడంతో వాళ్లే ఆందోళన చేస్తున్నారని సీఎం దుయ్యబట్టారు. నోటిఫికేషన్ ఇచ్చినప్పుడే జీవో 29 ఇచ్చామని, 564 పోస్టులకు మెయిన్స్ ఎగ్జామ్స్‌కు 31 వేల మందిని మెరిట్ ఆధారంగా సెలెక్ట్ చేశామన్నారు. ప్రిలిమ్స్ పరీక్ష అయ్యాక విపక్షాలు ఆందోళన చేస్తున్నాయని, ఒక్కసారి నోటిఫికేషన్ ఇచ్చాక మధ్యంతరంగా మారిస్తే కోర్టులు ఊరుకుంటాయా.. అలా మారిస్తే కోర్టులు రద్దు చేస్తాయన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న 10 ఏళ్లపాటు ఉద్యోగాలు భర్తీ చేయకుండా కాలయాపన చేసిందని, ఇప్పుడేమో పోటీ పరీక్షలను వాయిదా వేయాలని అంటోందని సీఎం మండిపడ్డారు.

**రండి.. హాల్ టికెట్లు తీసుకోండి..**

గ్రూప్–1పై విపక్షాల మాయలో పడి ఆగం కావద్దని, ఆందోళన చేస్తున్న 5 శాతం అభ్యర్థులు ఇప్పటికైనా హాల్ టికెట్స్ తీసుకోవాలని, వారంతా గ్రూప్– 1 మెయిన్స్పరీక్షలు రాయాలని సీఎం రేవంత్రెడ్డి కోరారు. నిబంధనలన్నీ అనుసరిస్తూ పకడ్బందీగా పరీక్షల కోసం ఏర్పాట్లు చేశామని, కొంతమంది అభ్యర్థులు కోర్టుకు వెళ్లారని, వాళ్ల అప్పీల్‌ను కోర్టు కొట్టేసిందని సీఎం గుర్తు చేశారు. న్యాయస్థానాలు ప్రభుత్వం నిర్వహిస్తున్న పరీక్ష విధానాన్ని సమర్థించాయన్నారు. ప్రతిపక్షాలు నిరుద్యోగులను, గ్రూప్ –1 అభ్యర్థులను వాడుకుంటున్నాయని, విపక్షాల ఉచ్చులో పడొద్దని సీఎం కోరారు. దయచేసి పరీక్షలు రాయాలని అభ్యర్థులకు సూచించారు.

**లాఠీచార్జి చేయవద్దు..**

నిరుద్యోగులు ఆందోళన చేస్తున్నప్పుడు ఉదారంగా వ్యవహరించాలని, నిరుద్యోగులపై కేసులు పెట్టాల్సిన అవసరం లేదని, పొరపాటున కేసులు పెడితే ఉద్యోగాలు సాధించడంలో ప్రతిబంధకంగా మారుతాయని, నిరుద్యోగులు ఆందోళన చేస్తున్న క్రమంలో కేసులు పెట్టవద్దని పోలీసులను ఆదేశిస్తున్నా అని సీఎం రేవంత్ వెల్లడించారు. కొంతమంది అభ్యర్థులు తెలిసో, తెలియకో ఆందోళన చేస్తున్నారని, ఆ అభ్యర్థులపై పోలీసులు లాఠీ ఛార్జి చేయొద్దని, కేసులు పెట్టి ఇబ్బందులు పెట్టొద్దని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. అభ్యర్థుల పట్ల పోలీస్ సిబ్బంది ఉదారంగా వ్యవహరించాలని, కేసులు పెట్టకుండా ఉన్నతాధికారులకు ఆదేశిస్తున్నామన్నారు. ఉద్యోగాల భర్తీలో రిజర్వేషన్ పకడ్బందీగా అమలు చేయాలనేదే తమ లక్ష్యమన్నారు.

**మీరు తప్పు చేస్తే ప్రభుత్వానికే అగౌరవం..**

ఇక, పోలీస్ డ్యూటీ కార్యక్రమం గురించి మాట్లాడుతూ.. 2013 నుంచి 2014 వరకు దాదాపు 11 ఏళ్లు పోలీస్ డ్యూటీ మీట్ నిర్వహించక పోవడం వల్ల నైపుణ్యం వెలికి తీయలేక పోయామని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అంచనాకు తగ్గకుండా రాష్ట్ర పోలీసులకు స్ఫూర్తినిచ్చే విధంగా పోలీస్ డ్యూటీ మీట్ నిర్వహించారని కొనియాడారు. రాష్ట్ర సాధనలో పోలీస్ కానిస్టేబుల్ కిష్టయ్య చేసిన త్యాగం మరువలేనిదన్నారు. పోలీస్ ఉద్యోగం అంటే సాధారణమైనది కాదని, ప్రభుత్వం, ప్రజాశ్రేయస్సు కోసం పనిచేసేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ గౌరవం పోలీసులపై ఉంటుందని, ఏ ఒక్కరు చిన్న తప్పు చేసినా రాష్ట్ర ప్రభుత్వ గౌరవం పోతుందనేది గుర్తుంచుకోవాలన్నారు. పోలీసు అధికారులు తమ ఉద్యోగాలను పారదర్శకంగా నిర్వహించినప్పుడే సామాన్యునికి న్యాయం జరుగుతుందన్నారు. రాబోయే 21వ తేదీన గ్రేహౌండ్స్‌లో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ప్రారంభిస్తామన్నారు. వచ్చే అకాడమిక్ ఇయర్ నుంచి స్కూల్‌లో అడ్మిషన్లు తీసుకోవచ్చని సీఎం ప్రకటించారు. యంగ్ ఇండియా స్కూల్‌లో చదివించుకోవచ్చని, డీజీపీ స్థాయి నుంచి హోంగార్డు స్థాయి వరకు తమ పిల్లలను చదివించుకునేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయిని అరికట్టేందుకు నార్కోటిక్స్ బ్యూరో ఏర్పాటు చేశామని సీఎం వివరించారు. మాదక ద్రవ్యాలు,సైబర్ క్రైమ్‌ను అరికట్టాలని, సైబర్ క్రైమ్ ను నియంత్రించడంలో దేశంలోనే ఉత్తమ అవార్డ్ వచ్చిందని సీఎం అభినందించారు. సైబర్ క్రైమ్, డ్రగ్స్‌ను నియంత్రణ చేసేందుకు ప్రకటనలు ఇచ్చే సినిమాలకే టికెట్ ధర పెంపు, ఇతర రాయితీలు ఇస్తున్నామన్నారు. డ్రగ్స్, గంజాయి కేసుల్లో ఎవరున్నా సహించవద్దని సీఎం ఆదేశించారు.



**టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశాం..**

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేశామని, పదేళ్లుగా వాయిదాలు పడుతున్న అన్ని ఉద్యోగాలను భర్తీ చేశామని సీఎం రేవంత్రెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో15 వేల మంది పోలీసు సిబ్బందిని కొత్తగా నియమించామని, 1,637 ఇంజినీరింగ్ పోస్టులు, 65 రోజుల్లోనే 11,067 ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. నిరుద్యోగుల భావోద్వేగాలను రెచ్చగొట్టి రాజకీయంగా లబ్ధి పొందాలని కొందరు చూస్తున్నారని, ప్రతిపక్షాల ఉద్యోగాలు పోతేనే.. వేలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చాయన్నారు. గతంలో ఉన్న జీఓ 55 రద్దుచేసి గ్రూప్ వన్ నోటిఫికేషన్ ఇచ్చామని, అదే సమయంలోనే జీఓ 29 తెచ్చామని, ఈ జీవో ద్వారా రిజర్వేషన్లు ఖాళీల భర్తీ విషయంలో ఒక పోస్టు ఖాళీగా ఉన్న 1:50 పిలవాలని నిర్ణయించామని, దీనిలో భాగంగానే 31 వేల మందికి పైగా మెయిన్స్‌కు అర్హత సాధించారని సీఎం వివరించారు. ఇప్పుడు 1:100 లెక్కన పిలవాలి అని ఆందోళన చేస్తున్నారని, నోటిఫికేషన్‌లో ఇచ్చిన నిబంధనలను మధ్యలో మారిస్తే కోర్టులు ఊరుకుంటాయా అని, నోటిఫికేషన్ ఇచ్చే సమయంలోనే 1:100 కోరుకుని ఉంటే అందుకు తగ్గట్టే ఇచ్చేవాళ్లం అని సీఎం తెలిపారు. రిజర్వేషన్ ప్రకారమే సెలెక్ట్ చేస్తే వేలమంది ఎస్సీ, ఎస్టీలకు అవకాశం వచ్చిందని, రిజర్వేషన్లు పకడ్బందీగా అమలు చేస్తుంటే కొంతమంది గందరగోళం సృష్టిస్తూ ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 10 ఏళ్ల అధికారంలో ఉన్నప్పుడు కనీసం నిరుద్యోగులకు అపాయింట్మెంట్ అయినా ఇచ్చారా అని ప్రశ్నించారు. ప్రజా యుద్ధనౌక గద్దర్ సమస్యలు చెప్పుకోవడానికి వెళ్తే నాలుగు గంటలపాటు ఎండలో నిల్చోబెట్టిన నీచమైన చరిత్ర బీఆర్ఎస్ ది అని ఎద్దేవా చేశారు. విపక్షాల ఉచ్చులో పడవద్దని, ప్రభుత్వం మీ సమస్యలను పరిష్కరించడానికి సిద్ధంగా ఉందన్నారు. ఒక అన్నగా తాను పరీక్షలు నిర్వహిస్తుంటే, వద్దు అని ఆందోళన చేస్తున్నారని, వారంతా ఆలోచించాలని, మీకు అవకాశాలు ఇవ్వడం కోసమే పరీక్షలు నిర్వహిస్తున్నామని, ఆందోళనలను విరమించి అపోహాలకు దూరం కావాలని సీఎం రేవంత్రెడ్డి కోరారు.

Printed and Published Mallika. On behalf of Sri Krishna Vande Jagadgurum Publications, Published at Banjara Hills Road , Erramazill 6-3-562-14, Hyderabad - Telangana 500082.
Printing at Colour Graphics, 2-6-652/12, Amberpet Musarambagh Road ,Hyderabad, 500013 Telangana. Editor Sramik (Responsible for selection of News under the PRB act )
Reg no APTEL / 2012/46581, Phone Number 9849290606, Email ID : janapadham0606@gmail.com